నమ్మలేని నిజాలు

గాలిలో పక్షి
మనిషికి రెక్కలు
రేపటి రోబో.

సారా నేరాలు
అందరు ధర్మాతులు
దొంగ దొరలు.

కీలు బొమ్మలు
జీవన చదరంగం
ఆటనైపుణ్యం.

రూకలు రెండు
రెండు కిలోల బియ్యం
ఉల్లి రైతుకు

యోషితా మణి
విశ్వపూజిత రత్న
వందన శతి.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

ప్రజాస్వామ్య వ్యవస్థలకు
న్యాయం సత్యాలు ముద్దు !
అవినీతి నిర్మూలనలో
తరతమ భేదాలు వద్దు !

నేరగాళ్ళకే శిక్షలు
అదే చివరి ఘట్టం !
చట్ట మెవరికి కారాదు
అతి దగ్గరి చుట్టం !

శ్రీనిజాలు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 6-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 182 పేజీలు:6 వెల: రూ.1/-


## ఈనెల 25న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం



డెహ్రాడూన్, ఏప్రిల్ 5: ఈ నెల 25వ తేదీన కేదార్‌నాథ్ ఆలయాన్ని తెరవనున్నారు. ఛార్‌ధామ్ యాత్ర నిర్వహక అధికారులు ఈ విషయాన్ని తెలిపారు. హెలికాప్టర్ సర్వీసులు కూడా ఆ రోజు నుంచే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్ ద్వారా కేదారీశ్వరుడిని దర్శనం చేసుకోవాలనుకునే భక్తులు ఐఆర్‌సీటీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ రాష్ట్ర టూరిజం శాఖ తెలిపింది. ఇప్పటి వరకు ఛార్‌ధామ్ యాత్రకు సుమారు ఆరున్నర లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నట్లు ఉత్తరాఖండ్ టూరిజం డెవలప్మెంట్ కౌన్సిల్ తెలిపింది. దీంట్లో కేదార్‌నాథ్‌కు 2.41 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారు.

# ధరల పెరుగుదలపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 5:గత కొంతకాలంగా భారీగా పెరుగుతున్న ధరలతో సామాన్యుల జీవితాలు కుదేలవుతున్నాయి. నిత్యవసర వస్తువుల నుంచి మొదలు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సహా అన్ని ధరలు అన్నీ ఆకాశన్నంటడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఈ పరిస్థితిపై మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉప్పు పిరం.. పప్పు పిరం.. పెట్రోల్ పిరం.. డీజిల్ పిరం.. గ్యాస్ పిరం.. గ్యాస్‌పై వేసిన దోశ పిరం.. అన్నీ పిరం.. పిరం.. జనం అంత గరం.. గరం' అంటూ ట్వీట్ చేశారు. అందుకే ప్రియమైన ప్రధాని మోదీ కాదు.. పిరమైన ప్రధాని మోదీ అని అంటున్నా అంటూ మంత్రి సెటైర్ వేశారు.

ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడానికి కారణమైన అదనపు ఎక్సైజ్ సుంకం, సెస్‌ను ఎత్తివేయాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే నిత్యవసర వస్తువుల ధరలు ఏవిధంగా పెరిగాయి వాటితో సామాన్యులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుపుతూ పలు పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను షేర్ చేశారు.

## ఒంటిమిట్టలో శివధనుర్భం గాలంకారంలో కోదండరాముడి దర్శనం



తిరుపతి, ఏప్రిల్ 5:కడపలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం శ్రీరామ చంద్రుడు శివధనుర్భంగాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

స్వయంవరంసమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారమని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఏఈవో గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

# కుట్రలో భాగంగానే హిందీ ప్రశ్నపత్రం లీక్: మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5:తమ రాజకీయ అవసరాల కోసం బీజేపీ నాయకులు పేపర్ లీక్ చేసి విద్యార్థులు, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందీ పేపర్‌ను లీక్ చేసిన బీజేపీ నాయకుడు వెంటనే దానిని ఆ పార్టీ అధ్యక్షుడైన బండి సంజయ్‌కి పంపించడం, ఆయన మీడియాకు సమాచారం అందించడం కుట్రలో భాగమేనని చెప్పారు. టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్‌నగర్‌లో స్పందించారు. పేపర్ బయటికి వచ్చిందని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి సమాచారం ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు. మీడియావాళ్లకు సమాచారం అందించి రాద్ధాంతం చేశారంటే దాని వెనుకున్న కుట్రను అర్థం చేసుకోవాలన్నారు.

పేపర్‌ను వందల వాట్సప్ గ్రూపులకు షేర్‌చేసి విద్యార్థులను భయాందోళనలకు ఎందుకు గురిచేశారని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లను లీక్ చేసిన నిందితుడు కూడా బీజేపీ కార్యకర్తేనని విమర్శించారు. ఇప్పుడు పదో తరగతి పేపర్ లీక్ పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజ్ చేయడం సర్వసాధారణం కాబట్టి ఆ కుట్రలను తెలంగాణలో (ంవశ్రీజీనిణజీనిజీ) అమలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు ఆరోపించారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఉన్నది ఎవరైనా, వారెంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ పోలీసు వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైనదని, ఇలాంటి కుట్రదారులను వెంటనే అరెస్టు చేసి, మరోసారి ఇలాంటి ఆలోచన చేయాలంటేనే భయపడేలా చేస్తామన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. పేపర్ లీకేజ్ ద్వారా తెలంగాణకు అప్రతిష్ఠ తెచ్చేందుకు చేస్తున్న కుట్రలను ఆపి.. రాష్ట్రాభివృద్ధికి అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితువు పలికారు

# కనుమరుగైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

సమాజంలో ఆధునికత విదేశీ సంస్కృతి నాగరికత పెరిగి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మౌలిక మార్పులు జరుగుతున్నాయి (సంభవిస్తున్నాయి). త్వరలోనే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితులు రానున్నాయి. నేటి రోజుల్లో ఎవ్వరూ ఫ్యామిలీ అంటే ఇష్ట పడటం లేదు. చిన్న కుటుంబాలు చింతలేని కుటుంబాలు నాటి సామెత నేడు చిన్న కుటుంబాలలో చింతలు ఎక్కువ గొడవలు వ్యసనాలు' గౌరవాలు తక్కువై వ్యక్తి కేంద్రంగా కుటుంబాలు రూపు మార్చు కుంటున్నాయి. ఒక నాడు సుఖ దుఃఖాలకు సంతోషాలకు ఆనందాలకు వేదికగా నిలిచిన కుటుంబ వ్యవస్థ నేడు అహానికి వ్యక్తి స్వార్థానికి కేంద్ర బిందువైంది. కలిస్తే కలహాలు పలకరింపులకు బదులు పగలు ప్రతీకారాలకు వేదికలుగా మారిన దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఫ్యామిలీ అంటే ఇష్టంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇష్టం లేకున్నా ఏదో తూ తూ మంత్రంగా ఇష్టం ఉన్నట్టు నటిస్తున్నారు. మనుషులతో కలవడానికి మాట్లాడ టానికి ఇష్టపడటం లేదు. మనుష్యులు అంటేనే జనాలకు అలెర్జీ పుడుతుంది. దగ్గరి వారు అంటే నచ్చడమే లేదు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడానికి కారణాలు:

### అహం అధికారం

సమాజములో పేరుకుపోయిన నిరక్షరాస్యత అనాలోచిత వైఖరి అతి తెలివి అహం ఇతరులను తక్కువగా చూసే మనస్తత్వం అధికార చెలాయింపు చిన్న తప్పును భరించే శక్తి , సహనం ఓర్పు లేకపోవడం

### స్వేచ్ఛా జీవనం

కుటుంబంలో సంపూర్ణ ప్రజాస్వామ్యం రాజ్యమేలడం స్వేచ్ఛా యుత జీవనాన్ని కోరుకోవడం పెద్దల నియంత్రణ లేకపోవడం

### సమిష్టి భావన లోపించడం

పెద్దలు, పిల్లలు అందరు కూర్చొని భోజనం చేయక పోవడం మాట్లాడుకోక పోవడం. సమిష్టి బాధ్యతలు లోపించడం వల్ల ఉమ్మడి కుటుంబాలు తగ్గి పోతున్నాయి.

### లోపించిన జవాబుదారీతనం

కుటుంబ సభ్యులు ఎంతసేపూ ఎంటర్ టైన్ మెంట్ ప్రోగ్రాంలలో మునిగి పోవడం. ఎక్కడో ఉన్న సినిమా నటులు ఈరోజు ఏమి చేశారో చెప్ప గలుగుతున్నారు. కానీ, ఇంట్లోని వారు ఎప్పుడు ఏమి చేస్తున్నారో చెప్పలేని దుస్థితి నెలకొంది.. జవాబుదారీతనం లోపించింది .

### పెరుగుతున్న షాడిజం

.చిన్న పొరపాటుకు అలిగి దగ్గరి వారిని రక్తసంబంధం వున్న వారిని దూరం చేసుకుంటున్నారు. ఒకరి నోటి దురుసు తనం కాఠిన్యత సంకుచిత మనస్తత్వం షాడిజం కుటుంబాన్ని మొత్తం చిన్నా భిన్నం చేస్తుంది .

### పోటీతత్వం పోలికత్వం

ఆర్థిక సమస్యలు సోషల్ స్టేటస్ విలాస జీవనం ఇతరులతో పోల్చుకొనే పోటీ తత్వం రాబడిని మించిన ఖర్చు ఇంటి పెద్దలు సరిగ్గా మేనేజ్ చేయలేక పోవడం వల్ల కుటుంబాలు పతమౌతున్నాయి.

### సామాజిక వేత్తల ఆందోళన

భార్యా' భర్తలు (తల్లి దండ్రులు) మధ్య అవగాహన లేకపోవడం ప్రతి చిన్న విషయానికి తగాదా పడుతూ ఉంటే ఇంటిల్లి పాది ఏదో దిగులుకు గురై ఇంటి నుండి వెళ్లిపోవడం.

ఫ్యామిలీల్లో గొడవలు, కొట్లాటలు తగాదాలు చూసి ఫ్యామిలీ అంటే జడుసు కుంటున్నారు. అన్యోన్యత ఆత్మీయత అనురాగాలు, ప్రేమతో, అవగాహనతో ఉన్న ఫ్యామిలీస్ కనుమరుగై పవిత్రమైన పునాదులు కలిగిన ఉమ్మడి కుటుంబాలు దూరమై కుటుంబ వ్యవస్థపై నమ్మకం సడలి పోతుందని ఈ స్థితి పలు సామాజిక సమస్యలకు దారి తీస్తుందని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .

### ఒంటరితనం వ్యసనాలు

కుటుంబ వ్యవస్థలోని మార్పులు పరిస్థితులు యువతను ప్రభావితం చేస్తున్నాయి .పిల్లలను హాస్టళ్లలో వుంచి చదివించడం వల్ల సురక్షిత భావన లోపించి ఒంటరితనం వ్యసనాలు పెరిగాయి .యువత లో మాదక ద్రవ్యాల ( డ్రగ్స్) వినియోగం పెరిగింది . వయసు 31 యేళ్లు దాటినా యువత పెళ్లి ముచ్చట ఎత్తడమే లేదు. గత నాలుగు దశాబ్దాలుగా కుటుంబాల్లో జరుగుతున్న మనస్పర్థలు, గొడవలతో విసిగి వేసారిన జనం ఫ్యామిలీ వ్యవస్థ వద్దు బాబోయ్ అని తమ పిల్లలకు నేరుగానే చెప్పే విచిత్ర పరిస్థితి దాపురించే సామాజిక ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయి.

### ప్రపంచీకరణ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

ప్రపంచీకరణ కార్పొరేట్ కల్చర్ ఆర్థిక స్థాయి ఆధునిక అవసరాలు, విదేశీ చదువులు విదేశీ కొలువులు ఆర్థిక వ్యత్యాసాలు, పోల్చుకోవడం పోటీ తత్వం తదితర కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నిలబడని స్థితి నెలకొన్నది.

### కుటుంబ విలువల క్షీణత

కుటుంబాలలో మమత మానవీయత, నైతిక విలువలు సహకారం, ప్రేమ, దయ, కరుణ జాలి, అంతరించాయి. వ్యక్తుల్లో భౌతిక వాదం పెరిగి స్వార్థపూరిత మనస్తత్వం పగలు ద్వేశాలు పెరిగాయి .మనుష్యులు అంటే విలువ లేదు. మనిషికి మరో మనిషి అంటే బోర్ వచ్చేసింది. మానవీయ బంధాలు అంతరించి "మనీ" సంబంధాలే బంధాలైనాయి. (రాజ్యమేలుతున్నాయి) అధిక జనాభా, విలాస జీవనశైలి తమ సుఖ సంతోషాలకు అడ్డు వచ్చిన వారిని అంతమొందించే హింసా ప్రవృత్తి కుటుంబాల్లో పెరిగి నేర సంస్కృతి నెలకొనడం గమనార్హం ..

### కౌన్సెలింగ్( మధ్యవర్తిత్వ) వ్యవస్థ లేకపోవడం

.ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై స్వేచ్ఛా స్వతంత్ర కుటుంబాల సంఖ్య పెరిగింది . కుటుంబాలలో ఏర్పడే వివాదాలు తగాదాలు తీర్చే పెద్దల కౌన్సెలింగ్ వ్యవస్థ లేదు. మధ్య వర్తిత్వం వహించే పెద్దలు వృద్ధులు ఓల్టేజ్ హోంల్లో ఉంటున్నారు. రాజీ కుదిర్చే వ్యవస్థ లేకపోవడం కుటుంబాలను కంట్రోల్ చేసే సామాజిక వ్యవస్థ లోపించడం వల్ల వ్యక్తుల ఇష్టాలకు ప్రాధాన్యత పెరిగింది.

### నిర్వహణ నైపుణ్యం

గృహనిర్వహణ కుటుంబ నిర్వహణ గొప్పకళ. అనుభవం వయసుతో నిర్వహణ కళ అబ్బుతుంది కుటుంబ బడ్జెట్ రూప కల్పన గొప్ప కళ అందరికీ లేకపోవడం వల్ల కుటుంబ వ్యవస్థ అతలా కుతలం అవుతుంది.

### ఎవరికి వారే యమునా తీరే

మెరుగైన మానవ సంభందాలు సత్ ప్రవర్తన సచ్ఛీలత మర్యాదలు అవగాహన కుటుంబ విలువలు పాటించే పరిస్థితులు క్షీణిస్తున్నాయి. మొండిగా మొరటుగా ప్రవర్తిస్తున్నారు. నేను నాభార్య/భర్త నా పిల్లలు అనే సిద్ధాంతం పోయి నాది నాదే అనే పాలసీ వచ్చింది. పిల్లలకు పెళ్లి కాగానే వేరు పడేయటం వేరు పడి సొంత ఇల్లు /అద్దె ఇల్లు తీసుకొని పెళ్లి చేసుకునే సంపూర్ణ స్వతంత్ర వ్యక్తుల సంఖ్య పెరిగిపోవటం నూతన ఆచారమైంది. ఎవరికి వారే యమునా తీరే సంస్కృతి నెలకొంది.

### విలువల క్షీణత

కుటుంబ విలువలు, కట్టు బాట్లు ఇక ఉండవు. ఇష్టారాజ్యం రోజులు వచ్చాయి. అన్నా దమ్ములు, అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ళ, భార్యా భర్తల మధ్య బలమైన బంధాలు ఇప్పుడు లేనే లేవు. సమస్త మానవ సంబంధాల స్వభావ స్వరూపాలు మారిపోయి కుటుంబ పరువు ప్రతిష్టలు మసక బారుతున్నాయి. మనిషి తత్వం అంతరించి "మనీ"తత్వం పెరిగింది

### నెట్టింట బంధాలు

ప్రపంచీకరణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజిటలీ కరణ విస్తరించి డిజిటల్ ప్లాట్ ఫామ్ పైన ఉన్నటువంటి నెట్టింట (ఇంటర్నెట్) ం దియైన సంబంధ బాంధవ్యాలే తమకి నిజమైనవి అని అపోహలో బతుకుతున్న జనం పెరిగి పోతున్నారు.

### ఆన్లైన్ శ్రద్ధాంజలి

ఒక వ్యక్తి మరణిస్తే వాట్సాప్ లో ఫేస్బుక్లో ఆకర్షణీయమైన మెసేజ్ పెట్టి అంతటితో వదిలేస్తున్నారు. తన శ్రద్ధాంజలి( సంతాపాన్ని) నలుగురి మధ్య ఘటించే ఓపిక లేకుండా బిజీ జీవనానికి అలవాటు పడటం శోచనీయం. మోయడానికి కూడా నలుగురు రాని పరిస్థితులు దాపురించాయి.

### సామాజిక ఉద్యమం

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనానికి సమాజంలోని అన్ని వ్యవస్థలు సమాన బాధ్యత వహించాలి. ప్రభుత్వం నూతన విద్యా విధానం లో నైతిక విలువలు మానవీయ విలువలను పాఠ్యాంశంగా చేర్చాలి .పాఠశాల కళాశాల స్థాయిలో హిందూ సంస్కృతి ,ఆధ్యాత్మికత, వేదాలు, ఉపనిషత్తులు 'భగవద్గీత పారాయణం పట్ల విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఉమ్మడి కుటుంబం పవిత్రత ప్రాముఖ్యత పట్ల ప్రతి కుటుంబంలో చర్చించాలి . పర్యావరణం విధ్వంసం వల్ల జరిగే ఉపద్రవాల కన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమైతే జరిగే సామాజిక ఆర్థిక ఉపద్రవాల గురించి మీడియా సినిమా ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సామాజిక సంస్థలు ధార్మిక సంస్థలు మహిళా సంఘాలు యువజన సంఘాలు గ్రామ పంచాయితీలు సమిష్టిగా కృషి చెయ్యాలి . స్వాతంత్ర ఉద్యమ తరహాలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునర్జీవనానికి బలమైన సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలి.



-నేదునూరి కనకయ్య
9440245771

# కోవిడ్ కేసులు పెరుగుతున్నాయ్.. వర్చువల్ విచారణ చేపట్టండి: సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇవాళ కీలక ప్రకటన చేశారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో లాయర్లు స్వేచ్ఛగా వర్చువల్ రీతిలో కోర్టుకు హాజరుకావచ్చు అని వెల్లడించారు.

కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్నట్లు వార్తపత్రికల్లో వస్తున్న కథనాలు స్పష్టం చేస్తున్నాయమని, ఒకవేళ లాయర్లు వర్చువల్ పద్ధతిలో కోర్టుకు హాజరుకావాలనుకుంటే, అప్పుడు వాళ్లు ఆన్‌లైన్ విచారణ చేపట్టవచ్చు అన్నారు.

హైబ్రిడ్ పద్ధతిలో అంటే వీలైతే కోర్టు లేదంటే వర్చువల్‌గా కూడా విచారణలో పాల్గొనవచ్చు అని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు.

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. రోజు రోజుకూ కొత్త కేసుల్లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. గత నాలుగు రోజులుగా మూడు వేల కేసులు నమోదవ్వగా.. తాజాగా 24 గంటల వ్యవధిలో ఏకంగా నాలుగు వేలకు పైనే కొత్త కేసులు వెలుగు చూశాయి.

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 1,31,086 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 4,435 కొత్త కేసులు బయటపడ్డాయి. నిన్నటితో పోలిస్తే ఈరోజు కొత్త కేసుల్లో 46 శాతం మేర పెరుగుదల కనిపించింది.

## రాజకీయంగా లబ్ధి పొందేందుకే ప్రశ్నపత్రాల లీక్.. బండి సంజయ్‌పై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, ఏప్రిల్ 5: రాజకీయంగా లబ్ధి పొందేందుకే బీజేపీ పార్టీ ప్రశ్నపత్రాలను లీక్ చేసే పథకానికి తెర లేపిందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ధ్వజమెత్తారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో బండి సంజయ్ దిష్టి బొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీల వ్యవహారంలో బీజేపీ అసలు రంగు బయటపడిందన్నారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ నిందితుడితో బండి సంజయ్ సహా ఇతర బీజేపీ నేతలకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం డైరెక్షన్‌లో ఇదంతా జరుగుతున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎ పథకం ప్రకారమే ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ కూడా తెలంగాణలో ఈ విధంగా పేపర్ లీకేజీల ఘటనలు జరగలేదు. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో తెలంగాణలో ఏదో ఒక అలజడి సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందన్నారు. మొన్న టీఎస్‌పీఎస్సీ పేపర్ , నిన్న పదవ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరుల కుట్ర కోణంపై నిష్పక్షపాత దర్యాప్తు కొనసాగుతోంది. దోషులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని మంత్రి హెచ్చరించారు.

## డీజీపీ ఆఫీసులో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు.. నివాళులర్పించిన అంజనీ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 5: రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్( జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి డీజీపీ అంజనీ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ విజయ్ కుమార్, ఐజీలు షా నవాజ్ ఖాసీం, చంద్ర శేఖర్ రెడ్డిలతో సహా పలువురు అధికారులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. సంఘ సంస్కర్త, స్వతంత్ర సమరయోధుడు, బడుగు వర్గాలకు చెందిన బాబు జగ్జీవన్ రామ్ భారత పార్లమెంట్‌లో పలు మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా, ఉప ప్రధానిగా కూడా పని చేశారని తెలిపారు.

## కుట్రలో భాగంగానే హిందీ ప్రశ్నపత్రం లీక్: మంత్రి శ్రీనివాస్ గౌడ్


మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5: తమ రాజకీయ అవసరాల కోసం బీజేపీ నాయకులు పేపర్ లీక్ చేసి విద్యార్థులు, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందీ పేపర్‌ను లీక్ చేసిన బీజేపీ నాయకుడు వెంటనే దానిని ఆ పార్టీ అధ్యక్షుడైన బండి సంజయ్‌కి పంపించడం, ఆయన మీడియాకు సమాచారం అందించడం కుట్రలో భాగమేనని చెప్పారు. టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్‌నగర్‌లో స్పందించారు. పేపర్ బయటికి వచ్చిందని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి సమాచారం ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు. మీడియావాళ్లకు సమాచారం అందించి రాద్ధాంతం చేశారంటే దాని వెనుకున్న కుట్రను అర్థం చేసుకోవాలన్నారు.

పేపర్‌ను వందల వాట్సప్ గ్రూపులకు షేర్‌చేసి విద్యార్థులను భయాందోళనలకు ఎందుకు గురిచేశారని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లను లీక్ చేసిన నిందితుడు కూడా బీజేపీ కార్యకర్తేనని విమర్శించారు. ఇప్పుడు పదో తరగతి పేపర్ లీక్ పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజ్ చేయడం సర్వసాధారణం కాబట్టి ఆ కుట్రలను తెలంగాణలో అమలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు ఆరోపించారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఉన్నది ఎవరైనా, వారెంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ పోలీసు వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైనదని, ఇలాంటి కుట్రదారులను వెంటనే అరెస్టు చేసి, మరోసారి ఇలాంటి ఆలోచన చేయాలంటేనే భయపడేలా చేస్తామన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. పేపర్ లీకేజ్ ద్వారా తెలంగాణకు అప్రతిష్ఠ తెచ్చేందుకు చేస్తున్న కుట్రలను ఆపి.. రాష్ట్రాభివృద్ధికి అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితువు పలికారు







రచనలకు
ఆహ్వానం

కండలు కరిగించె కార్మికులు
చెమటోడ్చి కష్టపడే కర్షకులు
బతుకులను వెల్లబోసే పేదవాళ్ళు
మౌన యంత్రాలై కదిలిపోతున్నా
సమాజం 'శ్రమ'ను గుర్తించటం లేదు.

'శ్రమ'
ఎవరికీ కనిపించని విలువ
ఎవరికీ అర్థంకాని బతుకు

అలాంటి 'శ్రమ'కు గుర్తింపే
శ్రామికుల, కార్మికుల దినోత్సవం
'మేడే'
ఈ సందర్భంగా

"శ్రమ"
అంశంపై వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

ఏప్రిల్ 15లోగా మీ వ్యాసాలు కవితలను పంపగలరు.

నేటినిజం దినపత్రిక,
ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.
E-mail : netinijam93@gmail.com

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 6-4-2023

## ఎందుకిలా?

ఒడిలో గడపాల్సిన బాల్యం
చదువుల పేరున వసతి బడుల్లో!
ఆడుతూ పాడుతూ అభ్యసించేబదులు
పడుతూ లేస్తూ కొనసాగించే చదువులు!!

కంటి అద్దాల వెనుక
కారుణ్యం బందీ అయింది!
జడత్వం నీడన
చైతన్యం జాడ లేకుండా పోయింది!!

ఖాతాల నిండా జీతాలు
అయినా అరకొర జీవితాలే!
అగ్ని సాక్షిగా జరిగిన పెళ్ళిలు
అగ్ని పరీక్షలవుతున్నవి!!

అనుభవాల నీడలులేవు
ఆత్మీయత దారుల్లేవు!
ముడుతల మడతల్లో దాచిన వేధనలతో
ఆశ్రమాల్లో తల్లిదండ్రులు!!

ఎందుకిలా.....
కాలాన్ని ఎదురించే బదులు
కాలంతో పాటు సాగిపోయే తత్వం!
ఎందుకిలా అనే బదులు
ఎందుకులే అనే ఆలోచనత్వం !!



-జగ్గయ్య.జి
9849525802



# 'లోక్ కవి' పద్మశ్రీ హల్దార్ నాగ్ కోసలి భాషా కవిత్వానికి పట్టాభిషేకం

**'హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**సాయంకాలపు వెలుగు పురిటి నొప్పులు పడుతున్నది**
**సృజనాత్మక కవిత్వాన్ని ప్రసవించు**
**ఇగో**
**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను '**

.... అంటూ సాగే ఆయన కవిత్వం ఆయనలాగే నేల మీద నడుస్తుంది.

ఆయన కవిత్వంలోని మాటలు సాధారణ ప్రజలు మాట్లాడే మాటల్లాగే వుంటాయి..

అయినా వాటిల్లో జీవన వాస్తవికత తొణికిస లాడుతుంది.

ఆయన కవిత్వం వాహికగా ప్రకృతితో మాట్లాడుతాడు.

రోజువారీ దినచర్యలాగే ఆయన కవిత్వం మనల్ని పలకరిస్తుంది.

అయినా అందులో తాత్వికత ధ్వనిస్తుంది.

సులభ శైలితో చదువరుల్ని జల్దీ జల్దీ పట్టేసుకుంటుంది.

ఆయన్ని"లోక్ కబి" ప్రజా కవి అంటారు. ఆయన భాష కోసిలి. దాన్నే సంబల్పూరి అనికూడా అంటారు. ఆయన హల్దార్ నాగ్.

తనకు 'పద్మశ్రీ' అవార్డు వచ్చిన దానికంటే నా భాషకు రాజ్యాంగ గుర్తింపు వచ్చినప్పుడే తనకు ఎక్కువ సంతోషం అంటాడు ఆ భాషా ప్రేమికుడు.

ఒరిస్సాలో ఆయన్ని ప్రకృతి కవి గా పేరెన్నికగన్న కవి గంగాధర్ మెహెర్ తో పోలుస్తారు. కానీ వాస్తవానికి ఆయన జీవితానికీ కవిత్వానికి మరెవరితో పోలిక లేదు. పోల్చే అవకాశమూ లేదు. ఎందుకంటే ఆయన జీవితం అష్టకష్టాలతో మొదలయింది. హల్దర్ నాగ్ ది పశ్చిమ ఒరిస్సాలోని బార్‌గర్హ్ జిల్లాలోని ఘెన్స్ అనే చిన్న గ్రామం. ఎగువ ఊళ్ళల్లో కలరా సోకితే అతడి కుటుంబం ఆ ఊళ్ళోకి వచ్చి స్థిరపడింది. అక్కడే అమ్మా నాన్నలకు ఆఖరి సంతానంగా హల్దర్ నాగ్ 1950లో జన్మించాడు. చర్మకార వృత్తి చేసే తండ్రి పాముకాటుకు చనిపోయాడు. అప్పుడు హల్దార్ నాగ్ కి కేవలం పదేళ్ళ వయసు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. దాంతో హల్దార్ నాగ్ మూడో తరగతిలోనే తన చదువు ఆపేశాడు. అతని కంటే ముందు పుట్టిన వాళు పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిపోవడంతో ఇంటికి దిక్కు గా ఒక్కడు మిగిలి పోయాడు. ఊళ్లో ఉన్న మిఠాయి దుకాణంలో గిన్నెలూ, వంట పాత్రలు కడిగే పనికి కుదిరాడు హల్దర్. అక్కడే వంట కూడా నేర్చుకున్నాడు. ఆ ఊరి పెద్దమనిషి అతణ్ణి స్కూల్లో వంటవా డిగా పెట్టాడు. దాదాపు పదహారేండ్లు అక్కడే వంటవాడిగానే బతికాడు. చాకిరీ చేస్తూ కాలం గడిపాడు. ఆ సమయంలో స్కూల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం గమనించాడు. తను పనిచేసే స్కూలుతో పాటు ఆ ప్రాంతంలో స్కూళ్ళ సంఖ్య పెరగడం చూసిన హల్దార్ వెయ్యి రూపాయలు అప్పు తీసుకుని స్కూల్ ఎదురుగానే స్టేషనరీ షాపు, పిల్లలు తినే తినుబండారాల చిన్న దుకాణం పెట్టుకున్నాడు. చిన్నప్పటినుండే హల్దార్ కి జానపద పాటలు వినడం పాడడం అలవాటుగా వుండేది. ఎంతో ఇష్టంగా కూడా వుండేది. ఆయనకు 'కృష్ణా గురు భజన్' , 'దాల్కాయీ', రసరేకలీ, మయేలా జాదా లాంటి అనేక జానపద గీతాలు పాడేవాడు. తనపైన బినోద్ నాయక కవిత్వం తొలి రోజుల్లో బాగా ప్రభావితం చేసిందని నాగ ఒక చోట చెప్పుకున్నాడు. 'గ్రామ పద' అన్న కవిత తనని కవిత రాసే దిశగా నడిపించిందని కూడా చెప్పాడు. అనంతర కాలంలో గంగాధర్ మెహెర్, రాదా నాథ్ రాయ్ ల కవిత్వం ఎక్కువ ప్రభావితం చేసిందన్నాడు నాగ్,

ఆ సమయంలోనే అతనిలో ఏవేవో భావాలు పెల్లుబుక సాగాయి. అవి కవిత్వ రూపంలో వెలికి వచ్చాయి. కోసలి భాషలో తనకు తోచింది ఆశువుగా చెప్పడం మొదలు పెట్టాడు. హల్దార్ కి మామూలు బడి చదువు లేకపోవడం పెద్ద ఇబ్బందేమీ కాలేదు కానీ మొదట్లో ఆయన ఆశువుగా చెబుతూ ఇతరులతో రాయించే వాడు. ఆ సమయంలోనే ఆ ప్రాంతంలోని 'అభిమన్యు సాహిత్య సన్సద్' అనే గ్రూప్‌తో హల్దార్ కు పరిచయమయ్యింది. దాంతో ఆయన కు ఒరియా సాహిత్యం పరిచయం అయింది. క్రమంగా ఒరియా చద వడం నేర్చుకున్నాడు. కోసిలి వివరంగా రాయడమూ అబ్బింది.



దాంతో ఒరియా సాహిత్యం చదువుతూనే హల్దర్ తన కోసలి భాషలో కవిత్వస్పష్టి సాగించాడు. 1990లో అతని తొలి కవిత 'ధోడో బర్గాచ్' (పాత మర్రిచెట్టు) స్థానిక పత్రికలో అచ్చయ్యింది. అప్పటికి హల్దార్ కి గొప్ప జ్ఞాపకశక్తి ఉంది. ఏ పుస్తకంలోని ఏ కవితనైనా విని, చదివి గుర్తు పెట్టుకోగలిగే జ్ఞాపకం ఆయనది. అంతేకాదు తన స్వీయ కవిత్వాన్ని కాగితం చూడకుండా అలవోకగా చెప్పగలడు. అందుకే ప్రజలు అతణ్ణి 'ఆశు కబి' అని, 'లోక కబి రత్న' అని పిలుస్తారు. తొలి కవిత తో ఆయన అందరి దృష్టిలో పడ్డాడు. అప్పటినుండి ఆయన పలు కవితలు అనేక పత్రికల్లో అచ్చయ్యాయి. దాంతో పాపులారిటీ పెరిగింది. "అప్పుడు నాకు చాలా ప్రశంసలు, సన్మానాలు లభించాయి. దాంతో మరింతగా రాయడానికి ఉత్సాహం పెరిగింది" అని ఒక చోట హల్దార్ చెప్పుకున్నాడు. ఇక తన చుట్టు పక్కల గ్రామాల్లోకి వెళ్ళడం కవిత్వం చదవడం ఆరంభించాడు. ఆయన తన కవిత్వం నిండా అట్టడుగు వర్గాల స్థితి, అణచివేతకు గురయిన వాళ్ళ పరిస్థితి పైననే రాసాడు.

భాష పట్ల హల్దార్ నాగ కి స్పష్టమయిన అభిప్రాయాలున్నాయి. 'భాషలెన్ని వున్నా సాహిత్యం ఒక్కటే అంటాడాయన. అంతే కయు సాహి త్యం మానవ ఆలోచనల్ని మనసుల్నీ అత్యంత గాఢంగా ప్రభావితం చేస్తునది కూడా ఆయన అభిప్రాయప డ్డాడు ఒక ముఖాముఖి లో. తన కవిత్వం ఇప్పటికే హిందీలోకీ, కొంత ఇంగ్లీశులోకీ అనువాదం అయింది.. 1916 పద్మ శ్రీ వచ్చిన తర్వాత హల్దార్ నాగ కవిత్వం మరింతగా వివిధ భాషల్లోకి అనువదించబ డుతున్నది.

ఆయన కోసిలి భాషలో రాసిన కవితల్లోంచి ఎంపిక చేసిన 24 కవితలతో మొదటి కవితా సంకలనం "కావ్యాంజలి" వచ్చింది. దాన్ని సురేంద్రనాథ్ ఇంగ్లీషులోకి అనువాదం చేసారు. 2016 వెలువడ్డ ఈ పుస్తకానికి సుప్రసిద్ధ ఒరియా కవి మనోజ్ దాస్ ముందుమాట రాసాడు. ఈ సంకలనంలోని కవితల నిండా ప్రాంతీయత, పౌరానికత, సర్వదేవ తావాదం, ప్రకృతితో మనిషికున్న అనుబంధం, సామాజిక అంతరాలూ ఇట్లా ఎన్నో అంశాల్ని ఆయన ఆవిష్కరించారు.

"కావ్యాంజలి" హల్దార్ నాగ్ ఎంపిక చేసిన కవితలు

ఈ సంకలనం లోని మొట్ట మొదటి కవిత దీర్ఘ కవిత. గ్రేట్ సతి ఊర్మిళ ( గొప్ప మహిళ ఊర్మిళ). రామాయణం లోని ఊర్మిళ పాత్రను ఉన్నతీకరిస్తూ ఈ కవితసాగుతుంది. అనేక రామాయణ కావ్యాల్లో ఊర్మిళ పాత్రకు పెద్ద ప్రాముఖ్యతను ఇవ్వలేదు. కాని హల్దార్ ఊర్మిళ గొప్ప మహిళా అని ఆమె స్థానం సీత, మండోదరిలతో సమానమయిందని అంటాడు. నాగ్ తమ ప్రాంతంలో వున్న ప్రాంతీయ రామాయణ కావ్యాలను ప్రేరణగా తీసుకుని ఈ కవిత రాసాడు. ఒరిస్సాలో 15 వ శతాబ్దానికి చెందిన విలంకా రామాయణ చాల ప్రసిద్ది పొందినకావ్యం. దాన్ని సరళా దాస్ రాసారు. ఈ వేర్వేరు రామాయణాల్లో అనేక వైవిధ్యాలు కనిపిస్తాయి. కైకేయి పాత్రను ఇక్కడ ఉదాత్తమయినదిగా సూచిస్తారు. రాముడు కనుక పట్టాభిషిక్తుడు అయితే జాతక రీత్యా చనిపోతాడని తెలిసిన కైకేయి రామున్ని వనవాసానికి పంపిందని ఇక్కడ రాసారు.అట్లే 14 సంవత్సరాలు నిద్రలో ఉన్నట్టుగా చెప్పిన ఊర్మిళ పాత్రకు కూడా అనేక రామాయణాల్లో అంత ప్రాముఖ్యత నివ్వలేదు. కానీ ఆమె చేసిన త్యాగం, ఆమె జ్ఞానం, స్వచ్ఛత చాలా గొప్పదని హల్దార్ రాసాడు..

**" ఏడు రామాయణాల్లో**
**ఎక్కడా ఉటంకించని ప్రస్తుతించని**
**స్త్రీ ఆమె**
**నాలోని కవికి ఆమె గొప్ప మహిళ**
**సీత కంటే కూడా స్వచ్ఛమయిన సతి ఆమె'**

అంటాడు హల్దార్ తన కవితలో.

ఇక హల్దార్ నాగ్ రాసిన కవితల్లో స్థానిక పత్రికలో ప్రచురితమయిన మొదటి కవిత " ముసలి మర్రిచెట్టు". ఈ కవితవి శేష ప్రాచుర్యం పొందింది. అనేక ఏళ్ళుగా నిలబడి వున్న ఆ చెట్టు తన జీవిత కాలంలో ఏమేమి చూసిందో చెబితే ఎట్లా వుంటుందో ఆయా అంశాల్ని ఈ కవితలో చెబుతాడు హల్దార్.

ఆ మర్రి చెట్టు తమ తాతల కాలం నుంచీ వుంది. దాని ఊడల లూగుతూ ఎంతో మంది పిల్లలూ పెద్ద వాళ్ళు అయివుంటారు. ఎందరో ప్రయానికులకూ,యాత్రికలకూ ఆ చెట్టు నీడనిచ్చి వుంటుంది. ఎంతోమంది పెళ్లి కొడుకులు ఈ చెట్టు కింది నీడ కింద ఎదురు చూస్తున్న తమ పెళ్లి కూతుళ్ళను తీసుకెళ్ళి ఉండొచ్చు. అంతేకాదు చనిపోయిన ఎంతో మందిని చివరి యాత్రకు ముందు ఈ చెట్టు నీడనే కొంత సేపు పడుకో బెట్టి వుంటారు. ఈ మర్రి చెట్టు ఇంకా ఎంతో మంది దొంగలనీ వాళ్ళు దోచుకున్న సొమ్ముని పంచుకున్న రీతినీ చూసి ఉండొచ్చు అంతేనా యువ ప్రేమికులెందరో ఈ మర్రి చెట్టు కిందే రహస్యంగా కలుసుకుని ఉండొచ్చు. ఇవన్నింటినీ చెప్పే సువర్ణావకాశం ఈ మర్రి చెట్టుకు వచ్చింది... గ్రామీణ

జీవితాల్ని ఆవిష్కరిస్తూ ఈ కవిత ఆద్యంతం ఆసక్తిగా కొనసాగుతుంది. చెట్టును వ్యక్తిగా చేసి భావాల్ని పలికిస్తుంది.

**" అది చూస్తుంది, అది వింటుంది,**
**దానికి తెలుసు, అది కనుక్కొంటుంది**

సాహితీ స్రవంతి



-వారాల ఆనంద్
9440501281

**కానీ ఒక్క మాటా పలుకదు**
**అది తన బాహువుల్ని బయటకు విశాలంగా విస్తరించుకుని**
**ఓ మౌన సాక్షిగా నిలుచుంటుంది"**

ఇక హల్దార్ నాగ్ కవిత " ఘన్నాలి నది" కూడా మనిషి జీవితాన్ని పరిశీలిస్తుంది.

నది పయనమయి సముద్రాన్ని చేరే క్రమాన్ని ప్రతీకాత్మకంగా మనిషి తన ఆధ్యాత్మిక జీవన యానాన్ని ఈ కవిత చెబుతుంది. పుటుక నుంచి మరణం దాకా మనిషి పయనించి ఆత్మ పరమాత్మలో కలిసి పోయే భావనని ఇందులో కవి ఉటంకిస్తాడు.

ఇక 'కావ్యాంజలి' లో జల్దార్ మరో కవిత 'మంత్రి– బిచ్చగాడు'

ఇది ఒక రాజకీయ వ్యంగ్యాత్మక కవిత. ఇది సంభాషణ తీరులో సాగుతుంది. మంత్రికి బిచ్చగాడికి నడుమ సాగే మాటల సమాహారం ఇది. ఒక మంత్రి ఓ బిచ్చగాడికి ఒక సూచనచేస్తాడు. బిచ్చ మెత్తుకోవడం ఆపేసి కష్టపడి పని చేసుకుని డబ్బు సంపాదిచుకోమని.. దానికి బదులుగా ఆ బిచ్చగాడు సామాన్య ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును దోచేయకుండా ప్రజావసరాలకు వాడమని మంత్రికి బిచ్చగాడు ఎదురు సూచిస్తాడు...

**" నా కడుపులో ఆకలి కోసం నేను అడుక్కుంటాను,**
**కానీ నేను నా స్వార్థం కోసం కాదు..**
**నువ్వు స్వార్థపరుడివి,**
**అడుక్కోవడం మంచిది. ఇల్లు దగ్గరో గుడిసె దగ్గరో.."** అంటాడు.

హల్దార్ రాసిన మరో చిన్న కవిత 'వెలుతురు-మట్టి దీవం' లో చాలా ముఖ్యమయిన అంశాన్ని తీసుకున్నాడు. తమ భాష కనుమరుగయితే ఆ ప్రాంత ప్రజలు తమ మాటలని మర్చిపోతారు. చివరికి వాళ్ళు తమ ఉనికినే కోల్పోతారు అంటాడు నాగ్... ఇందులో మాత్రు భాష పట్ల మనుషులకు ఉండాల్సిన ప్రేమా, అభిమానాలను నొక్కి చెబుతాడు కవి. అంతరించిపోతున్న ప్రాంతీయ భాషల పట్ల హల్దార్ కవిగా పడ్డ వేదన ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది.

**" వారసుల్లేని బంధువుల్లో**
**నూతనంగా పుట్టిన వాడు దీవం వెలిగించినట్టు,**
**ఒరిస్సా ఉత్తర ప్రాంత భాష**
**దీపంలో వత్తిలా కాలి విస్తరించనీ.."**

....

ఇక హల్దార్ నాగ్ రాసిన మరో ప్రతిభావంతమయిన కవిత " అంతనేందుకు ఇల్లు వదిలేసాడు".

వ్యంగంగా వున్నా ఈ కవితలో సామాజిక అవలక్షణాన్ని చెబుతాడు. ప్రజలు సాధారనంగా నిందలు బలహీనుల పైనే వేస్తారు. కవిత బలవంతుల ఎదుట బలహీనులు తల వంచడాన్ని చెబుతుంది.

**" అందరి పెదాల పై ఒకే వాదన**
**గెలుపు బలహీనులకు సాధ్యం కాదు**
**నీళ్ళు ఎప్పుడూ పల్లానికే ప్రవహిస్తాయి**
**తప్పు ఎప్పుడూ బలహీనునలవైపే.."**

ఇట్లా సాగిన హల్దార్ నాగ కవి త్వం మొదట 'కావ్యాంజలి' పండిత, పామరుల ఆదరణ పొందింది

అతని రెండవ సంపుటం 'కావ్యాంజలి2'ను సంబల్‌పూర్ యూనివర్సిటీ విద్యార్థులకు పాఠ్యాంశా లుగా పెట్టింది. అతడి అనేక కవితలు ఇప్పుడు పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలు అయ్యాయి. దేశీయ జానపద శైలి, పురాణ సంకేతాలు, కల్తీ లేని భాష, అప్రయత్న ధాటి హల్దర్ నాగ్ కవిత్వాన్ని జీవంతో, ఆకర్షణతో నింపుతాయి. అతడి రచనలు ఇప్పటి వరకూ దాదాపు 22 పుస్తకాలుగా వచ్చాయి. పాటలూ రాశాడు. సంబల్పూర్ యూనివర్సిటీ అతనికి డాక్టోరల్ డిగ్రీ ఇచ్చి సత్కరించింది.

2020 లో పాండిచేరీ విశ్వవిద్యా లయానికి చెందిన ప్రొఫెసర్ జై శంకర్ బాబు రెండు రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు వైస్ చాన్సెలర్ గురు మీత్ సింగ్ ఆధ్వర్యంలో జరిగన ఈ సెమినార్లో "హల్దార్ నాగ్ కా కావ్య సంసార్' అన్న పుస్తకాన్ని విడుదల చేసారు. దినేష్ కుమార్మాలి సంబల్ పూరి భాషనుంచి హిందీ లోకి అనువాదం చేసిన హల్దార్ పుస్తకమది. ఆ సెమినార్లో నాగ కవిత్వం మీదా విస్తృతంగా చర్చ జరిగింది. ఇంకా హల్దార్ కే లోక్ సాహిత్య పర విమర్శ, రామాయణ్ ప్రసంగొన్ పర్ హల్దార్ కే కావ్య అవుర్ యుగిన్ విమర్శ' అన్న పుస్తకాలూ వెలువడ్డాయి .ఇంకా ఇనిద్రా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ తో సహా అనేక విశ్వవిద్యాలయాల్లో హల్దార్ కవిత్వం మీద పాఠాలున్నాయి. పరిశోధనలూ చేస్తున్నారు.

ఒకప్పుడు వంట కాంట్రాక్టు కోసం ఎదురు చూసే హల్దర్ నేడు ఒరిస్సా రాష్ట్రంలో దేశంలో ప్రతిరోజూ సాహిత్య కార్యక్రమాలకు ఆహ్వానింపబడే కవిగా గౌరవం పొందుతున్నాడు. అంతే కాదు 2015లో వచ్చిన 'కౌన్ కిత్నే పానీ మే' అనే లఘు చిత్రంలో రాధికా ఆప్టే, సౌరభ్



శుక్లా వంటి నటులతో కలిసి నటించాడు.

హల్దర్ నాగ్ కవిత్వాన్ని కవి గుల్జార్ అమితంగా అభిమానించాడు. ఆయన హల్దర్ నాగ్ కవిత్వం చదివి 50 వేల రూపాయల తన సొంత డబ్బును కానుకగా పంపాడు. అంతేకాదు, బాలీవుడ్ దర్శకుడు 'భరత్‌బాల' తన 'వర్చువల్ భారత్' ఫీచర్ కింద హల్దర్ పై తీసిన షార్ట్ ఫిల్మ్ కు వ్యాఖ్యానం కూడా అందించాడు. హల్దర్ కవిత్వం భారీగా ఇంగ్లిష్‌లోకి అనువాదం అవుతోంది. ఇప్పటికి 350 సంస్థలు హల్దర్‌ను సత్కరించాయి. ఇంత పేరు వచ్చినా ఇప్పటికీ చెప్పుల్లేకుండా నడుస్తాడు హల్దర్. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా 'పద్మశ్రీ' అందుకు నేటప్పుడు కూడా నాగ్ చెప్పులు తొడుక్కోలేదు.

'ఈ మట్టి మీద నడిచేటప్పుడు మొత్తం భూగోళం మీద నడుస్తున్న ట్టుగా భావించు' అంటాడు హల్దర్

అంతే ఈ భూమి మనందరిది. అంటే ప్రతి మనిషి మరో మనిషి కోస మే అని భావిస్తూ 'మనం' అనే భావన తో బతకాలని హల్దర్ కోరుతాడు.

అనేక రకాల దుర్గుణాలు ప్రతి మనిషిలో ఉ ఒడేవే. కాకుంటే వాటిని వదిలించుకోవడానికి అప్పుడప్పుడు హల్దర్ వంటి మహాకవి పిలుపు అవసరం.

ఇప్పుడా పిలుపు వినిపిస్తూ తిరుగుతున్నాడు హల్దర్ నాగ్. హల్దర్ నాగ్ " సినిమా లాంటి ఇతర కళా రూపాల కంటే సాహిత్యం అమరమ యిందని, అది ఎ భాషలోని దయినా సమాజానికి దారి చూపే టార్చ్ లైట్ లాంటిదని యువకులతో అంటాడు. అందుకే యువత సాహిత్యాన్ని ఎక్కువగా అధ్యయనం చేయాలని సూచిస్తాడు.

హల్దార్ నాగ రాసిన రెండు కవితలకు నేను చేసిన స్వేచ్ఛానువాదం

### అమృతం

**హల్దార్ నాగ్**
**లోకంలోని సప్త సముద్రాలనుండీ**
**అమృతం జనించనీ**
**ఆకాశంలోంచి చంద్రుడూ**
**అమృతాన్నే కురవనీ**
**మనిషికి ప్రాణాధారమయిన అమృతమే**
**మాతృమూర్తి స్థనాలనుండి**
**బొట్లు బొట్లుగా రాలనీ**
**మానవత్వంతో మంచి మనుషులు చేసే**
**మంచి కార్యాలనుంచీ**
**అమృతమే పారనీ**
**ఇంకా**
**కవిగారు రాసే సున్నితమయిన పదాలనుంచీ**
**అమృతమే ప్రవహించనీ**

### హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను

**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**సాయంకాలపు వెలుగు పురిటి నొప్పులు పడుతున్నది**
**సృజనాత్మక కవిత్వాన్ని ప్రసవించు**
**ఇగో**
**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**సమాజాన్ని శుభ్రం చేయాలనుకుంటే**
**మొదట నిన్ను నువ్వు శుభ్రం చేసుకో**
**ఇతరులను చేయి పట్టి పైకి లాగాలనుకుంటే**
**ముందు నువ్వు రెండడుగులు పైకెక్కు**
**లోకం ఆకర్షణలకు మోహితుడవు కాబోకు**
**అత్యాశకు గురి కాకు**
**ఇదో**
**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**సృష్టి సమస్తంలో మహోన్నతుడ యిన మనిషి**
**చీకట్లో మగ్గుతున్నాడు**
**తన సుఖం కోసం అందరినీ దుఖం పాలు చేస్తున్నాడు**
**ధర్మ ఖర్మ అవమానాల్ని త్యజించాడు**
**నరకం వైపు మరింత దగ్గరవుతున్నాడు**
**ఇగో**
**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**అమ్మ ఆశీర్వాదం తీసుకో**
**దుఖాన్ని సంతోషంగా భావించు**
**విశామున్న చోటే అమృతమూ లభిస్తుంది**
**వెతుకు ప్రేమతో ఉద్రేకంతో వెతుకులాడు**
**నువ్వు విషం తాగాల్సివచ్చినా**
**ఇతరులకు అమృతమే పంచు**
**అవసరమయితే తలపై గంగా నదిని ధరించు**
**ఇగో**
**హల్దార్ నీకో లేఖ రాస్తున్నాను**
**మంచి మాటలతో లోకంలోని**
**అందరినీ నీ వాళ్ళని చేసుకో**
**సమస్త ప్రపంచాన్నీ ఒకే చూరు కిందికి తీసుకురా**
**అందులో నువ్వూ నివాసముండు**
**నీ సమస్త రచనా శక్తినీ**
**ఈ లోకాన్ని సరి చేసేందుకు వాడు**

## తెగిపోతున్న బంధాలు

ఒకే గర్భంలో పుట్టి
పేగుబంధంతో పెనవేసుకున్నాము
నీవు వేసుకున్న అంగీ,లాగు
నేవేసుకున్నాను.

నీవు తొడిగిన చెప్పులు నేతొడిగాను
ఒకే రొట్టెలో చెరి సగము తిన్నాము
అవ్వ కుట్టిన బొంతలో నిద్రపోయాము
బడికి ఐదు మైళ్ల దూరం
నడవలేక నడవలేక కాళ్ళు గుంజి
కూలా బడితే నీ భుజాలపై ఎత్తుకుని
నన్ను పుస్తకాల బస్తానీ మోస్తివి .

నాకు బువ్వ తినిపిస్తివి
కారమైతే నోట్లో నోరు పెట్టి ఊదితివి
పంతులు పలక బలపం లేక
బడి నుంచి వెళ్ళ గొడితే
నాకిచ్చి
నీవు దెబ్బలు తింటివి.

కంచం ఒకటే మంచం ఒకటే
బడిలో కడుపునొప్పితో
దొడ్డికి పెట్టితే
ముడ్డి కడిగితివి
మూతిని తుడిస్తివి .

ముక్కు కారుతుంటే ఛీదరించక
నీ అంగీతో తూడిస్తివి
నేను ఏడిస్తే నువ్వు ఏడిస్తివి
వానొచ్చిందంటే నీ పుస్తకాల సంచి
గొడుగు చేస్తివి
నేనవ్వితే నువ్వు ఆకాశమంత నవ్వితివి
అ ఆలు దిద్ద రాకపోతే వేలుపట్టి దిద్దిపిస్తివి

నీవు రాసిన పెన్నుతో
నా రాతను మారుస్తివి
నా కాళ్లకు పల్లేరుకాయ గుచ్చుకుని
వలవలా ఏడుస్తుంటె
చూడ లేక నీవు ఏడిస్తివి

పెరిగి పెద్దయ్యాక బంధాలన్ని
దూరం అయ్యాయి...
బహు దూరం అయ్యాయి...

అవ్వ కథలు...
తాత్తయ్య సామెతలు...
మంచం కోళ్ళ కథలు....
నేడు కనుమరుగయ్యాయి...
ఇంటి బంధాలు బంధువవైయ్యాయి...

అనుబంధాలు
కలుషితమవుతున్నాయి....
ప్రేమా లేదు ఆప్యాయత అసలే లేదు
అంతాడబ్బుమయం ఇదో విష వలయం..
విష వలయం ఛేధించలేక.
గిలగిలా కొట్టుకుంటూ.......
ఒంటరై పోతున్నాము...

ఆస్తి కోసం అమ్మ, నాన్న, అన్న,
చెల్లి తమ్ముడు బంధాలు తెగిపోతున్నాయి
అనుబంధాలు మాయమవుతున్నాయి
అనురాగాలు రాలిపోతున్నాయి
ప్రేమ సంబంధాలు కుప్పకూలి పోతున్నాయి

జారిపోతున్న బంధాలకు జన్మనిద్దాం
తెగిపోతున్న సంబంధాలకు ప్రాణం పోద్దాం



-బాటసారి
9440174050

## ఆ నిరుద్యోగి గుండె కోతలోని ఆవేదన ఓ అగ్నికణం సుమా !



-డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

అకాలంగా మబ్బులు కమ్మాయి.
కంకి తడిసి ముద్దయ్యింది.
పండిన పంట
చేలోనే ఒరిగిపోయింది.
ఆ కళ్ళు గుంటలు పడ్డాయి.
వడ్డీలు నడ్డి విరుస్తున్నాయి.
అకాల మైనది ఏదైనా
గుండెపోటే తెస్తుంది.
ఆ బిడ్డను ఎంతో కష్టపడి
చదివించుకున్నారు.
బురదలో కాలు పెట్టనివ్వలేదు.
ఆ సర్టిఫికెట్ కు
విలువే లేకుండా పోయింది!
ఆ కాగితం వెనుక
ఎంత శ్రమ ఉంది?
ఎంత ప్రయాణం ఉంది?
ఎంత ఆశ కళ్ళల్లో ఇంకిపోయింది?
ఎంత ఓపిక నిస్సారమైంది?
ఎన్ని ఆఫీసుల చుట్టూ
ఆ యువతి కాళ్లు తిరిగాయి?
ఈ దేశం గుండెలకు
గాయం చేసిన వారంతా
అందలం ఎక్కి కూర్చున్నారు.
సర్టిఫికెట్లు, డిగ్రీలు, డాక్టరేట్లు
కొనుక్కున్న వారంతా
మల్టీస్టారర్ హాస్పిటల్స్ కట్టారు.
ఏ దినపత్రిక వెదికి చూసినా
ఆ యమ్మకు
ఒక్క సమాచారం లేదు.
ఏలికల ఆర్భాటాల చిత్రపటాలు.
అవును! ఈ ఆవేదన
అగ్ని కణం కాదంటారా?
ఈ అరిగిన కాళ్లు,
పగిలిన పాదాలు,
బొబ్బలెక్కిన ముని వేళ్ళకు
సమాధానమెక్కడ?
ఎంతకాలం
రాని నవ్వు నవ్వుతూ
తిరగమంటారు?
నెత్తుటి చుక్క లేదు.
ఎవరు వీరు ?
లక్షల కోట్లు పోగేసుకుంటూ
చదువుతున్న బిడ్డల
కన్నీటి చుక్కలను
ఏరుకుంటున్నారు?
జీవితానికి అర్థమేమిటి ?
ప్రజల ఆవేదన తెలుసుకోలేకపోవడం
అంధత్వమా? అహంభావమా?
అవును! ఆ అసెంబ్లీ ముందు
టాటా సుమోలు, ఖరీదైన కార్లు.
ఆ ఆటోలో ఇరవై మందిని కుక్కి
దూరాలకు కూలీలను
తీసుకు వెళ్తున్న
ఆ వాహనం బోల్తా పడింది.
కూలి కోసం నడిచి నడిచి
కాళ్లు కుదేలవుతున్నాయి.
విద్యకు పరమార్థం
ఉద్యోగ భద్రత కాదంటారా?
నిరాశ నిస్పృహలు
సెగలు సెగలుగా కమ్మినప్పుడు
భూమి కంపించదంటారా?
చదువుకున్న వారిని
అంకెల గారడీతో
మోసగించగలమంటారా?
అంకెలు ఉపాధి కాదు కదా !
ఆ పురోహితోత్తములు
అన్నమయ్య పదకీర్తనలతో
విగ్రహాలను ఊరేగిస్తూ
నలుగు పాటలు పాడుతున్నారు.
అక్కడ పెళ్లీడుకు వచ్చిన యువతికి
జత కూడటం లేదు.
విగ్రహాలకు పట్టు వస్త్రాలు!
రత్నాల ఆభరణాలు!!
గోడలకు కూడా
బంగారపు తాపడాలు!!!
ఆ పెళ్లి కాని యువతి చెవులకు
కమ్మలు కూడా లేవు.
మెడ బోసిపోయి ఉంది.
పెదాలు పగిలి
రక్తపు మరకలు కనిపిస్తున్నాయి.
ఆ బిడ్డను చూసి
తల్లి ఆవేదన పడుతుంది.
తల్లి వేదనతో పాటు
బిడ్డకీ ఒక ఆవేదన ఉంది.
బిడ్డ కూడా
నేనూ తల్లిని కావాలనే
కలలు కనదంటారా?!
ఒక నెలవులోనే నాలుగు ముఖాలు.
ఏ భావం మరొక భావంతో కలవదు.
ఆ భావ కవి
తన సతి ఆసుపత్రిలో ఉన్నా
గాలి తెమ్మెర మీద కవితలు రాసి
తోటలో విహరిస్తున్నాడు.
ఎవరీ కవులు ?
అక్షరాల్లో పూలవాసనలే గాని
అగ్ని కణాలను పుట్టించలేని
వేదనారహితులా ?
ఆ బిడ్డ గుండె కోతలోని ఆవేదన
ఓ అగ్ని కణం సుమా!
కవిత్వమంటే ఏమిటి?
మనిషి మెదడును
మేల్కొల్పేది కాదా?
మానవతా సౌగంధ్యం
విరజిమ్మేది కాదా?
అనంత సాహిత్య మథనం నుండి
జీవిత ఘర్షణ నుండి పుట్టేది కాదా?
వీరి అక్షరాలు
వాచాలుర నోటి తుంపర్ల లా
ఆవిరై పోవడం లేదా?
గుండె కొలిముల్లో కాల్చబడే
కత్తుల పదునుండి
ప్రజల ఆవేదనను చెప్పగలిగే
సామర్థ్యం వీరికి ఉందా?
నిజమే!
జీవితం నుండి
శ్రమ నుండి
ఘర్షణ నుండి
పోరాటం నుండి
ఆవేదన నుండి
జనించేదేగా కవిత్వం.
వీరు నిస్తబ్దులు.
భజంత్రీలు.
అర్థ సౌందర్యం లేని
శబ్దాలను కుమ్మరిస్తున్నారు.
నిజమే!
అంబేద్కర్ చెప్పినదంతా
కవిత్వమే.
జీవిత ఘర్షణ నుండి
కవితా శాసనాలు సృష్టించి
వెళ్ళారాయన.
మనిషి లేని ప్రకృతి
ప్రకృతి లేని మనిషి
సజీవులా? నిర్జీవులా?
కవులారా !మేల్కొనండి.
ఆ నిరుద్యోగి గుండెచప్పుడును
మీ అక్షర ప్రవాహం నుంచి
ప్రతిధ్వనించండి!
అప్పుడు రాజ్యం
సమాజం వైపు చూస్తుంది.
కవి విశ్వజనీనుడు.
కవిత్వం
రాజ్యానికి శస్త్ర చికిత్స చేస్తుంది.
సుకవి వైద్యుడు.
మేధో మధనం నుండి
అతని కవిత్వం అగ్నిధారవుతుంది.
అంబేద్కర్ చూపుడువేలే
మనకు మార్గం.

## రుబాయిలు

అనుభవాల పెంచుటకే లోకమందు పయనం
అనుభూతి జెందుటకే జీవితానుగమనం
పరుగుల పోటీకై దించింది కోరికల రూపాయే
వలయమదే సర్వమనే భ్రమలందునె భ్రమణం!

జాడలు మరిచి నీవు నడచినావో
జాగారూకత లేక ముడిచినావో
అడుగులేసిన దారులేవైన గానీ
నీడలే నిజమంటు భ్రమసినావో...

ఆశలెన్నొ పరుచుకున్న భవితలొకె నడక
కాలాన్నే మరిచిపోయి వేగంలో పడక
ఎవడు వేయు కాలగతికి కళ్లెం..?
వీడని ఓ గ్రహణంతో అడ్డొచ్చే తడిక

మోసాలు..రోషాలతో ఏమిటి ఈ బతుకు
పోలికలతొ చీలుతున్న మనసుకెపుడు అతుకు?
కల్మషాల నీడల్లో కదులుతున్న జీవితం !
శాంతమెపుడు రగులుతున్న
హృదయాన్నే ఉతుకు..



-మోతుకూరి అశోక్ కుమార్
9247380976

## ఖండగతి

అంత్యప్రాస గజల్

గువ్వలా మాటొకటి ఎదపైకి వాలింది
గుండెలయ ఏకంగ చిందులే వేసింది.

ఎడతెగని ముచ్చట్లు ఎడబాటు అవలేదు
తాళ్లేసి లాగేసి వంతెనను చేర్చింది

ఊసులే గలగలల గోదారి నదిలాగ
పరవళ్ల సెలయేరు ఇద్దరిని ముంచింది

అలకొకటి చిలుకలా వాలేను అపుడపుడు
కళ్ళనే కమ్ముకుని మేఘమై కురిసింది.

మంజీర నాదాలు కనురెప్ప ద్వారాలు
తనరూపు నిలుపుకుని కనుపాప మురిసింది



-మంజుల సూర్య,
9704022244

# పర్యావరణ రక్షణ కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత

పర్యావరణ కాలుష్యం ప్రపంచ వ్యాప్తంగా సమస్యగా మారింది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక మరియు సాంకేతిక ఆర్థిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి.

ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్ మరియు నీటి ఆవిరి సమతుల్యంగా ఉండాలి. ఈ సమతుల్యత జల వలయం సాధారణ వర్షపాతం మరియు జంతువుల మొక్కల జీవిత చక్రాలకు సహాయపడతాయి. పర్యావరణ సమతుల్యం వన్యప్రాణి మరియు వ్యవసాయానికి మానవుని అభివృద్ధికి సహాయపడుతుంది.

### కాలుష్యం రకాలు

కాలుష్య కారకాలను వాతావరణంలో ప్రవేశపెట్టడాన్ని కాలుష్యం అని అంటారు. పర్యావరణ కాలుష్యం ప్రధానంగా వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం, ఉష్ణ కాలుష్యం, నేల కాలుష్యం మరియు వ్యవసాయ గృహ నిర్మాణం మరియు కాలుష్యం అటవీ నిర్మూలనకు దారితీస్తుంది. అటవీ నిర్మూలన పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తున్నది.

జీవవులకు జీవించుటకు అత్యవసర వనరులైన గాలి' నీరు కాలుష్యానికి గురి అవుతున్నాయి. పర్యావరణ కాలుష్యం మానవుల మరియు జంతువుల జీవితంపై ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. వృక్షజాలం, జంతుజాలం, అంతరించిపోయే ప్రమాదం ఉంది.

### ధనిక దేశాల ధనార్జన పర్యావరణ విధ్వంసం

ఆధునిక పట్టణీకరణ ప్రపంచీకరణ పారిశ్రామికీకరణ మరియు ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ సమాచార సాంకేతికత డిజిలీటీకరణ యుగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థికాభివృద్ధి పేరుతో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాయి .మరో వైపు ప్రపంచ ధనిక దేశాలు ధనార్జనే ధ్యేయంగా పేద దేశాల యొక్క వనరులు వినియోగించుకొని పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగించి ఐశ్వర్యాన్ని పెంచుకోవడంలో పోటీ పడటం వల్ల పర్యావరణ సమతుల్యతకు భంగం వాటిల్లి పర్యావరణ విధ్వంసం పెరుగుతుంది.

### మానవ వనరుల కొరత

పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకొని మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల మరియు జీవాధారమైన నీరు కాలుష్యామౌతుంది. వాహనాలు ఫ్యాక్టరీలు వదిలే పొగ పెట్రోల్ మరియు డీజిల్ మరియు వంట బొగ్గు ఉపయోగించడం వల్ల విడుదల చేసే పొగ పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నాయి.

### కార్బన్ ఉద్గారాలు పర్యావరణం

పరిశ్రమలు మరియు వాహనాల ద్వారా ఉత్పన్నమయ్యే వేడి సమీప ప్రాంతాల పర్యావరణ ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా ఉష్ణ కాలుష్యనీ పెరుగుతుంది కారణమవుతుంది.

ఈ విధంగా మానవుడి అనేక కార్యకలాపాల వల్ల కార్బన్ ఉద్గారం ఎక్కువ కావడంతో వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి.

### కాలుష్యం వ్యాధులు

వాయు కాలుష్యం వల్ల శ్వాస కోశ వ్యాధులు ఊపిరితిత్తుల బలహీనత క్షయ మరియు వివిధ రకాల మెదడు మరియు గుండె సమస్యలు పెరుగుతున్నాయి. వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైన ఊపిరితిత్తులు-వ్యాధులు, ఉబ్బసం, మెదడు రక్తం గడ్డ కట్టడం కంటి చూపు మందగించడం లాంటి రుగ్మతలు ఎక్కువైతున్నాయని అనేక ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి. నేడు మనం నిత్యం వాడే పాలు పండ్లు కూరగాయలు కలుషిత మౌతున్నాయి. కాలుష్యం ఫలితంగా ప్రపంచంలో మానవ జాతి నయం చేయలేని భయంకర రోగాల బారిన పడి వైద్య ఆరోగ్య రంగానికి సవాల్ గా పరిణమించడం శోచనీయం.

### శబ్ద కాలుష్యం

వినికిడి లేదా శ్రవణ జ్ఞాన సంభంద అవయవాలపై ప్రతికూల ప్రభావాలను కలిగించటంవల్ల. చెవుడు, అలసట మరియు మానసిక ఒత్తిడి అధికమై పలు మానసిక అనారోగ్య సమస్యలను సృష్టిస్తుంది పలు అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది.

రసాయనిక ఎరువులు ఫేస్టిసైడ్స్ వాడకం పర్యావరణ కాలుష్యం అణు పరీక్షలు పరిశ్రమలు ఆటోమొబైల్స్ ఇతర వాహనాల ద్వారా వదిలి వేయబడిన పొగ, సింథటిక్ డిటర్జెంట్లు, నత్రజని ఎరువులు అధిక దిగుబడులు పేరు మీద

> **పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకొని మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది**

వ్యవసాయ రంగములో పంట పొలాల్లో కూరగాయల పాడి పంటల ఉత్పత్తిలో విచ్చల విడిగా వాడుతున్న పురుగుమందుల వినియోగం భూమి ఉత్పత్తి సామర్థ్యం క్షీణించి భూగర్భ జలాలను కూడా కలుషితం చేస్తుంది.

### భోపాల్ యూనియన్ కార్బైడ్ విషవాయువు

భోపాల్ లో డిసెంబర్ 3, 1984 సంవత్సరంలో జాతీయ యూనియన్ కార్బైడ్ పురుగుమందుల తయారీ కర్మాగారం నుండి విషపూరితమైన మిథైల్ ఐసోసైనేట్ (ఓఎఅ) వాయువు లీకేజీ ఫలితంగా ప్రపంచంలో పెద్దపారిశ్రామిక పర్యావరణ కాలుష్య విషాదం సంభవించింది. స్త్రీలు మరియు పిల్లలతో సహా 2000 మందికి పైగా వ్యక్తులు మరణించారు మరియు 3000 మంది తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు.

### పర్యావరణ రక్షణ ఉదాసీనత

మన దేశంలోనే కాకుండ ప్రపంచమంతటా కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలు పోరాటాలు కొనసాగినప్పటికీ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు అధికార యంత్రాంగం పాలకుల్లో ప్రజాప్రతినిధుల్లో పర్యావరణ పరిరక్షణ చట్టాల మీద పరిజ్ఞానం లేకపోవడం నిర్లక్ష్య ధోరణి ఉదాసీనత రాజ్యమేలడం వల్ల కాలుష్యం పెరిగి మానవ మనుగడకు సవాల్‌గా పరిణమించింది .అభివృద్ధి పేరుతో ప్రతిరోజూ జరుగుతున్న విచక్షణారహిత పర్యావరణ చట్టాల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా తీవ్ర నిరసన ఉద్యమాలు సాగుతున్నాయి.ఐనప్పటికీ పర్యావరణ విధ్వంసం కొనసాగుతూనే వుంది.

### పర్యావరణ రక్షణకు కాలుష్య నివారణకు పరిష్కార మార్గాలు

### పరిశ్రమల స్థాపన

ఇప్పటికే ఉన్న కర్మాగారాలను జనావాస మండలానికి దూరంగా తరలించాలి . భౌతికంగా ఎత్తివేయడం సాధ్యం కాదు కాబట్టి కాలుష్య కారకాలను అంచెల వారిగా తగ్గించాలి . పర్యావరణ కాలుష్య సమస్యను పరిష్కరించడానికి భవిష్యత్తులో ప్రభుత్వాలు కర్మాగారాలను జనావాసాలకు సుదూర ప్రదేశంలో, టౌన్‌షిప్‌కు దూరంగా ఉన్న పారిశ్రామిక సముదాయాల ఏర్పాటుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి.

### ప్రజలకు అవగాహన

వాహనాల తనిఖీలు హానికరమైన వాయువు నివారణపై ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించాలి. తగిన టెక్నాలజీ పరిశోధనలు చేసి పరిష్కారం చూపాలి.

పరిశ్రమలు పర్యావరణ చట్టాలను నిబంధనలు పాటించాలి. పర్యావరణ రక్షణకై ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలి.

### కాలుష్య రహిత పారిశ్రామికీకరణ

పర్యావరణ కాలుష్యం కలిగించని పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి. నదీజలాలను కాలుష్యం లేకుండా చేయడానికి ఫ్యాక్టరీ వ్యర్థాలను నదుల్లోకి వదిలేయడాన్ని నిషేధించాలి.

### అడవుల రక్షణ

అడవుల నరికివేతను అరికట్టి అడవులను అభివృద్ధి చేయాలి. మనం ప్రస్తుతం పర్యావరణ సమతౌల్యతను పునరుద్ధరించడంలో విఫలమైతే మానవులు భూ గ్రహం పైన నివసించుట అసాధ్యం అవుతుందని తెలుసుకోవాలి.

### ప్రపంచ మానవాళి కాలుష్య రహిత సమాజం

ప్రపంచ స్థాయిలో వాయు కాలుష్యాన్ని పర్యవేక్షించడానికి మరియు అధ్యయనం చేయడానికి సాధ్యమైన నివారణ విధానాలను రూపొందించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను పరిశోధన అభివృద్ధి శిక్షణ సంస్థనుఏర్పాటు చేసింది.

మిత్ర దేశాలను ఒకచోట చేర్చి సున్నాకర్బాన్ 2050 నాటికి ఉద్గారాలను చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రపంచ యుద్ధం జీరో 2019 ప్రారంభించబడింది ఈ దిశగా ప్రపంచ మానవాళి కాలుష్య రహిత సమాజ నిర్మాణం లో సంపూర్ణ భాగస్వాములు కావాలని ఆశిద్దాం

### పర్యావరణ రక్షణ సామాజిక భాధ్యత

ప్రభుత్వాలు ప్రజల సహకారం లేకపోయినట్లతె ఎన్ని చట్టాలు రూపొందించినా ఆశించిన ప్రయోజనం నెరవేరదు. పర్యావరణ సమతుల్యతను సంరక్షించుట ప్రజల సామాజిక బాధ్యత. నిరంతర ప్రజా చైతన్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుంది . కాలుష్య రహిత సమాజ స్థాపనలో పర్యావరణ స్పృహ కీలక పాత్ర పోషిస్తుంది.

### ప్రకృతి సేద్యం

ప్రకృతి సేంద్రియ వ్యవసాయం విధానాన్ని అమలు చెయ్యాలి.

### పర్యావరణం పాఠ్యాంశం

ప్రభుత్వం,పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు యువజన, మహిళా సంఘాలు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణా చట్టాల పై అవగాహన శిభిరాలు చర్చా ఘోష్టి నిర్వహించాలి నూతన విద్యావిధానంలో పర్యావరణ పరిరక్షణను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి విద్యార్థులకు పర్యావరణం మీద అవగాహన కలిగించాలి.

పర్యావరణ పరిరక్షణ మీద ప్రతి విద్యార్థి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చెయ్యాలి .

మీడియా పర్యావరణ రక్షణ

మీడియా ప్రసార సాధనాలు ఎలక్ట్రానిక్ మీడియా పర్యావరణ ప్రకృతి రక్షణ కాలుష్య నియంత్రణ విధానాల పట్ల ప్రజలకు

చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. పర్యావరణ రక్షణ సామాజిక ఉద్యమింగా కొనసాగాలి.



**-నేదునూరి కనకయ్య,**
9440245771

## ప్రశ్నించు

ఓ పడతీ! ప్రశ్నించు
అన్యాయాలను, అక్రమాలను
సహించి వహించకు మౌనం
అపరాధివి నీవవుతావు.

ఛాందసభావాల
మాయా జాలాన్ని వదిలించుకో
ఇతిహాసాలు, పురాణాల
అసలర్థం తెలుసుకో.

ద్రౌపది ప్రశ్నలు
ధర్మానికి పునాది వేశాయి
సావిత్రి ప్రశ్నలు
యమరాజునే దాసోహం చేశాయి.

ద్రౌపది,సావిత్రి
నీకు ఆదర్శం కావాలి
ప్రశ్నించే ధైర్యం
నీగుండెని తాకాలి.

షట్కర్మల బాధ్యతలు
హక్కులుగా మలచుకో
సంసార శకటాన్ని
ఒడుపుగ నడుపుకో.

సామాజిక బాధ్యత
ఎరిగి ప్రవర్తించు
స్వేచ్ఛకు అర్థం
విచ్చలవిడితనం కాదని గ్రహించు.

దీక్షతో సాధిస్తే
శిఖరాలు అధిరోహించగలవు
నిబద్ధతతో కృషిచేస్తే
ఋషివే నీవు కాగలవు
నిన్ను మించిన శక్తిలేదు
నిన్ను కాదన్నవారికి భుక్తిలేదు
నీకంటనీరు ఒలికితే చాలు
తుడిచిపెట్టుకు పోయేను
అనంత సిరులు.

మంచితనం, మానవత్వం
సహనం, దయాగుణం,
నీ ఆభరణాలు
ప్రేమ,త్యాగం, క్షమా గుణాలు
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు
అయినా...

మానవమృగాలు సంచరిస్తున్న
ఈ నవనాగరిక సమాజంలో
అడుగడుగున ప్రశ్నిస్తూ నీ
అస్తిత్వాన్ని దక్కించుకో!

నరకాసురులెదురైతే సత్యవి కావాలి
మహిషాసురులపాలిటి దుర్గవి కావాలి
ఆత్మరక్షణలో నీవు రాటుదేలాలి
అభ్యుదయంలో నీవు దీటు కావాలి.



**-లలితావర్మ,**
9949672671

## అందం

(కథ)

అలలు మోకాళ్ళని తాకి , అరికాళ్ళ కింది ఇసుకని తీసుకుపోతుంటే ఎంతో ఉల్లాసంగా అనిపిస్తుంది. అమ్మ ఏదేదో మాట్లాడుతూనే ఉంటుంది. నేను వింటున్నట్టే ఉంటాను కానీ నా ధ్యాసంతా అలల మీదే ఉంటుంది. తర్వాతి అల క్షణం ఆలస్యమైనా నాకు అదొక పెద్ద సందిగ్ధమే.

ఇక్కడికి వచ్చి కాసేపు గడపటంలో ఎంతో గొప్ప అనుభూతి ఉంది. ఇసుకని మనం చేతుల్లోకి తీసుకున్నా కూడా కెరటం దాన్ని విడిపించుకుపోతుంది. వాటి ఆత్మీయత అటువంటిది.

సముద్రం అలల ద్వారా చేసే అలికిడి కేవలం శబ్దం కాదు. మనం నేర్చుకోలేకపోతున్న దాని యొక్క భాష. మనకి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తుంది. మాట కలపాలని , సంభాషణలు సాగించాలని ప్రయత్నిస్తుందని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఆ భాషని అందుకోవాలనే ఆలోచన నాది. కానీ తన భాషని , లక్షణాలనే ఇతరులకు రుద్ది అన్నింటినీ తనకు అనుకూలంగా మార్చుకునే మనిషి జాతిలో పుట్టినందుకు నాకు ఇది ఒక మహాయోగమే.

అవును , మనిషి అన్నీ తన కోసమే అన్నట్టుగా ప్రతీదానిని వాడుకుంటూ పోతూనే ఉన్నాడు. విచ్చలవిడి ఉపయోగమే నాగరిక , పురోగతి అన్నట్టుగా సాగిపోతున్నాడు. వినియోగం శృతిమించిన విషయాన్ని గమనించుకోకుండా ప్రపంచాన్నే చెత్తకుప్పగా చేస్తున్నాడు.

> **‘జ్ఞానం ఉన్నది వైవిధ్యానికి తోడు కలవటానికి , కానీ ప్రపంచం మేం తయారు చేసే మానవ వనరులను విధ్వంసం కోసమే వాడుకుంటున్నది”**

నాకు ఈ ఆలోచనలూ , అభిప్రాయాలూ అన్నీ అమ్మ నుంచి అంటుకున్నవే. తను ఎపుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే ఉంటుంది. నాకు వినిపిస్తూనే ఉంటుంది. తనకు అవగాహన కలిగే విషయాలను విశ్లేషించి తద్వారా కలిగే ఆలోచనలను నాకు వివరిస్తుంది.

నాన్న యూనివర్సిటీలో ప్రొఫెసర్ . ఆయన అన్నీ టైం టు టైం మనిషి కాబట్టి నాకు ఆయన టైంలో వాటా నేను ఆశించినంతగా ఏమీ దక్కదు. అపుడపుడూ అంటుంటాడు “జ్ఞానం ఉన్నది వైవిధ్యానికి తోడు కలవటానికి , కానీ ప్రపంచం మేం తయారు చేసే మానవ వనరులను విధ్వంసం కోసమే వాడుకుంటున్నది” అని.

సాటి మనుషుల గురించి ఎన్ని రకాలుగా మాట్లాడుకుంటామో అన్ని రకాల అవలక్షణాలూ అందరిలోనూ ఉన్నాయ్ అనిపిస్తుంది నాకు. ఎందుకంటే అసంతృప్తులన్నీ పరస్పరాలే. ఎవరూ ఒప్పుకోరు అంతే.

ఈ అలలు నాలో ఏదో చలనం రేపి ఈ విధంగా లోతైన ఆలోచనలను బయటికి తీస్తాయి. దీనినే మనసు యొక్క అన్వేషణ అంటారు అని అమ్మ చెప్పింది. అసలు మనసు ఇవన్నీ మోపు వేసుకుని ఏం అన్వేషిస్తుందో ? నాకు అర్థం కాదు.

అల తాకినపుడల్లా నేను నవ్వుతాను. నవ్వినపుడు నా ముఖం ఎంతో కాంతివంతంగా కనిపిస్తుందట అమ్మ ఎపుడూ చెప్తూనే ఉంటుంది. అందం అంటే అందరూ కోరుకునే ఆకర్షణీయమైన లక్షణమని అంటారు. కానీ , విమలక్క నాతో అపుడపుడూ బాధపడుతుంది “అందమే ఆడదానికి శాపం” అని. రమ అక్కేమో అందంగా పుట్టడం అదృష్టం అంటుంది.

ఒకే అంశం మీద ఇద్దరు ఒకే వయసు ఆడవారికి పూర్తి భిన్నమైన అభిప్రాయాలు ఉండటం మొదట్లో నాకు ఆశ్చర్యం అనిపించేది. వాళ్ళ పలు సందర్భాలలో పంచుకున్నటువంటి అనుభవాల ద్వారా విషయం అర్థమైంది. విమల అక్క ఇతరుల నుండి తాను ఎదుర్కున్న అనుభవాలు బాధాకరమైనవి. తనకు ఉన్న అందాన్ని బట్టే తన మీద ఏర్పడ్డ అభిప్రాయాలు , అనుమానాలు తనకు కలిగించిన క్షోభ చెప్తుంటే విని బాధ అనిపించింది. ఇక రమ అక్క సంగతి మరో రకం. సాటి ఆడవారు కూడా తనని సరిగ్గా పలకరించరట. తను ఉన్న చోట ఎటువంటి పనుల్లో ఏం అంతరాయం కలిగినా తన వైపే చూస్తూ “శకునం” అని ఒక్క మాట అంటారని ఎన్నో సార్లు బాధ పడింది. నా రంగు నేను రుద్దుకున్నది కాదు కదా ! అని ఎన్నో సార్లు ఏడ్చింది. “నీవు నల్లగా ఉన్నా నిన్ను చేసుకు న్నాను” అని అంటూ బావగారు ఏదో ఆదర్శం గా ఫీల్ అయిపోవటం విని ఆశ్చర్యం వేసింది.

మనుషులకు దేవుడు చూపుని ఇచ్చింది రంగును చూసుకొని మురిసిపోడానికా ? రంగుని బట్టి కలుపుకుపోడానికా ? ఎంత అవివేకం ! అసలీ మనుషుల మెదడు ఏమిటో నాకు అర్థం కాదు. నీటికి రంగు లేదు అంటారు. మళ్ళీ “ నీలంగా ఉన్నాయ్ , నల్లగా ఉన్నయ్ , ఒండు గోధుమ రంగులో ఉన్నాయ్ “ అంటారు.

తీరంలో కూర్చుంటే ఇంతే , అలలు నన్ను ఎక్కడెక్కడికో తోసేస్తుంటే , సమీరాలు మళ్ళీ ఈడ్చుకు వస్తాయ్. ఎంతైనా ఇదొక గొప్ప అనుభూతి. ఈ అనుభూతికి , మనసుకి రూపాలు ఉండవట. అవి కేవలం అమూర్తాలేనంట. మనిషి ముఖ కవలికల్లోనే వ్యక్తమవుతాయంట అమ్మ చెప్పింది.

“చీకటి పడుతుంది ఇక వెళ్దాం పదా “ అన్నది అమ్మ. ఏది చీకటో , ఏది వెలుగో నాకు తెలియదు. ఇట్లా పక్కనున్న వారే చెప్పాలి. మాట వినపడిన దాకా ఎదుట ఉన్న మనిషి ఎవరో కూడా నాకు తెలియదు. ఎవరైనా దానం చేసిన కళ్ళు దొరికితే నాకు అమర్చాలని మా అమ్మానాన్నలు నన్ను ఊయలలో వేయకముందు నుంచీ ప్రయత్నిస్తునే ఉన్నారంట. ఇన్నేళ్ళు గడిచినా ఇప్పటికీ కుదరలేదు. నాకు ఇరవైనాలుగ్గంటలూ చీకటే !

ఇవాళ పౌర్ణమి కాబట్టి సముద్రం మరింత ఆకర్షణీయంగా ఉందంటుంది అమ్మ.

నిజానికి నాకు దేని గురించి విన్నా చూడాలని మాత్రమే అనిపిస్తుంది. చూపు ఉన్న వారికేమో తాము చూసిన దాన్ని తెచ్చిపెట్టుకోవాలని ఉంటుందంట. నాన్న ఆవిధంగా ఎన్ని పక్షులను తెచ్చి బాల్కనీలో పెట్టుకున్నాడో ! అన్నయ్య విచిత్రంగా భూములనే చూస్తాడంట. బాగాపంటలు పండే భూములు కొనటం ప్లాట్లు అని చెప్పి పంటలు ఆపటం. నాకు ఈ ఇద్దరిలోనూ వ్యత్యాసమేమీ అనిపించదు. ఒకరు ఒక జీవిని బంధించి దాని తరాన్ని అంతటితో ఆపితే , ఇంకొకరు పచ్చదనాన్ని నియంత్రిస్తున్నారు. ఇట్లా ఈ భూమ్మీద ప్రతీ ఒక్కరూ విధ్వంసంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అసలు అందరూ ఒకరిని ఒకరు అనుకునే హక్కు పోగొట్టుకున్నవారే.

చెవిలో పడే ప్రతీ చిన్న శబ్దం నేనో పెద్ద దురదృష్టవంతు రాలిని అనే బాధని కలిగిస్తుంది. ఏమిటో అనే ఆందోళన. అదే విధంగా అన్నీ సరిగ్గా ఉన్నవారు ఎల్లవేళలా సంతోషంగా ఉన్నట్టు కూడా నాకేమీ వినపడరు. మరి మనిషికి ఏం కావాలి ?



**- కుషినేర్ల నందు,**
9603234503.

## చెలిమి ఎరిగి స్నేహం చేయాలి

(కథ)

ఒకానొక అడవిలో ఓ మర్రిచెట్టు కింద ‘ఫలితుడు’ అనే ఎలుక జీవిస్తోంది. అదే చెట్టు మీద ‘రోజసుడు’ అనే పిల్లి కాపురం చేస్తోంది.

ఒక వేటగాడు రోజూ రాత్రి ఆ చెట్టు దగ్గరకు వచ్చి, అక్కడ ఓ వలను పరచి వెళ్లేవాడు. రాత్రివేళ అందులో ఏవో ఒక జంతువులు చిక్కుకుంటాయి కాబట్టి, ఉదయమే వచ్చి వాటిని చేజిక్కించుకుని చక్కగా పోయేవాడు.

ఒక రోజు అనుకోకుండా ఈ ‘రోజసుడు’ అనే పిల్లి పోయి పోయి ఆ వలలో చిక్కుకుపోయింది.

పిల్లి వలలో పడింది కాబట్టి ఎలుక దానిచుట్టూ నిర్భయంగా తిరుగుతూ ఆహారం కోసం వెతకసాగింది. ఆహారం కోసం అటూఇటూ చూస్తున్న ఎలుక గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. కొద్ది దూరం లోనే ఒక ముంగిస, గుడ్లగూబ దానికి కనిపించాయి. అవి ఎలుకని గుటుక్కుమని పించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎలుకకి ఏం చేయాలో పాలుపోలేదు. అలా అపాయంలో ఉన్న ఆ ఎలుకకి చటుక్కున ఓ ఉపాయం తట్టింది. వెంటనే వలలో ఉన్న పిల్లి దగ్గరకు వెళ్లి **‘నేను ఈ వలని కొరికి నిన్ను రక్షిస్తాను. బదులుగా నువ్వు నన్ను ఆ గుడ్లగూబ, ముంగిసల బారి నుండి రక్షించవా !’** అని అడిగింది. పిల్లికి అంతకంటే ఏం కావాలి. వెంటనే అది సరేనంది. దాంతో ఎలుక నిర్భయంగ వెళ్లి పిల్లి పక్కన కూర్చుంది.

పిల్లి ఉన్న ఎలుకని పట్టుకునే ధైర్యం లేక ముంగిస, గుడ్లగూబ జారుకున్నాయి.

‘నేను నీ ప్రాణాలను రక్షించాను కదా ! మరి తొందరగా వచ్చి ఈ వలని కొరికి నన్ను బయటపడేయి,’ అని అడిగింది పిల్లి.

ఉండు ఉండు నీలాంటి బలవంతులతో స్నేహం చేసేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి కదా ! నిన్ను ఇప్పుడే బయటకు తీసుకువస్తే, నువ్వు నన్ను భక్షించవని ఏమిటి నమ్మకం ? కాబట్టి ఆ వేటగాడు వచ్చే సమయానికి నిన్ను విడిపిస్తాను,’ అంటూ సంజాయిషీ ఇచ్చుకుంది ఎలుక అన్నట్లుగానే మరుసటి ఉదయం ఆ వేటగాడు వచ్చే సమయానికి కాస్త ముందుగా వలని పుటుక్కున కొరికేసింది.

వేటగాడు వస్తున్నాడన్న తొందరలో పిల్లి గబుక్కున చెట్టు మీదకు చేరుకుంది. ఇటు ఎలుకా తన కలుగులోకి దూరిపోయింది.

మర్రిచెట్టు కిందకి చేరుకున్న వేటగాడు కొరికివేసిన వలని చూసి తెగ బాధపడ్డాడు. తన ప్రయత్నం వృధా అయిపోయిందన్న బాధతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. వేటగాడు అటు వెళ్లగానే పిల్లి కిందకి చూస్తూ ‘ఎలుక మిత్రమా! నువ్వు నా ప్రాణాలను కాపాడావు. ఇక నుంచి మనమిద్దరం మంచి స్నేహితులుగా ఉందాము,’ అంటూ పిలిచింది. దానికి ఎలుక నవ్వుతూ ‘మిత్రుడు ఎప్పుడు శత్రువు అవుతాడో, శత్రువు ఎప్పుడు మిత్రుడు అవుతాడో చెప్పడం కష్టం. అలాంటిది సహజ శత్రువులం అయిన మనమిద్దరి మధ్యా స్నేహం ఎలా పొసుగుతుంది? ఇప్పుడు ఏదో నీకు సాయపడ్డానన్న కృతజ్ఞతతో నాతో స్నేహం చేయవచ్చు. కానీ ఏదో ఒక రోజున ఆకలి మీద ఉన్న నీకు నన్ను చంపి తినాలన్న ఆలోచన నీకు రాకపోదు.

శత్రువులతో అవసరార్థం స్నేహం చేసినా, ఆ స్నేహాన్ని విడువకపోతే ఎప్పటికైనా ఆపద తప్పదని శుక్రనీతి కూడా చెబుతోంది. నువ్వు నన్ను రక్షించావు. బదులుగా నేను నిన్ను రక్షించాను. మన బంధం ఇక్కడితో చెల్లు. ఇక మీదట నా జోలికి రాకు !’ అంటూ కలుగులోకి దూరిపోయింది ఎలుక. ఎలుక మాటల్లోని నిజాన్ని గ్రహించిన పిల్లి మారుమాటాడకుండా వెనుదిరిగిపోయింది. భీష్ముడు చెప్పిన ఈ కథలోని పాత్రలు సహజశత్రువులైన పిల్లీ ఎలుకలే అయినా, ఇందులోని నీతి నిత్యజీవితానికి కూడా వర్తించి తీరుతుంది.

అపకారికి ఉపకారం చేయవచ్చు, కానీ తెలిసి తెలిసీ అపకారితో స్నేహం చేయకూడదని హెచ్చరిస్తోంది.



**-ఉమాశేషారావు వైద్య**
9440408080

## రాజ్యాంగ పరిరక్షణ

మృగాల్లో ఉన్న ఐక్యత
పక్షులలో ఉన్న సమైక్యత
మనుషుల్లో మాత్రం మృగ్యం.

ఏ హంగూ ఆర్భాటాలు లేని జీవితం
స్వార్థబుద్ధిలేని మనిషికి మాత్రమే సాధ్యం.

రాజ్యాంగాన్ని అనుసరించే నడుస్తున్న మనం
మతం కులం తేడాలతో
విధ్వంసాలను సృష్టించుకుంటున్నాం.

జంతువుల్లో లేదు స్వార్థం
మనుషుల్లో ఎందుకు పుట్టిందో
జంతువులలో లేని పైశాచిక ఆనందం
మనుషుల్లో ఎందుకు కలిగిందో.

మనిషి కూడబెట్టింది మొదలు
మానవత్వం మంటగలిసింది
ఇకనైనా
అస్తిత్వాన్ని కాపాడుకుందాం
ప్రజాస్వామ్యాన్ని నిలబెడదాం.

కుల మత పిచ్చితో
మనిషి భయానకమయ్యాడు
మాటలు కోట గోడలై
మనిషి తనము నియంతను చేసింది.

భారత రాజ్యాంగం
హక్కులను, ఆదేశ సూత్రాలను
జీవిత సత్యాలను సూత్రీకరించడానికి
మనిషి మనుగడను కలుపుట కొరకే.

నిరంకుశత్వమును వధించే వరకు
మానవీయ సంబంధాలు ఎండమావి లాంటివే.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు
రాసిన రాజ్యాంగం
ఆదివాసీల ఆభరణం
సబ్బండ వర్ణాల వారికి దివ్యఔషధం.

విశిష్టత విస్తృతమై వెలగాలి
ప్రతి పల్లెకు ప్రతి గల్లికి చేరాలి
భారత రాజ్యాంగ రక్షణ
నేటి అవసరం
రాజ్యాంగ పరిరక్షణలో
పాలుపంచుకోవాలి మనమందరం



**-బండి సూర్యా రావు,**
9490681815

## జ్ఞాపకాల శిల

చెప్పకుండానే ఆకస్మాత్తుగా
మహారాజులా
దర్జాగా నువెళ్లిపోయావు
కానీ వీరి దృష్టిలో నేను
అంటరాని దాన్నైపోయా..

ఊపిరి నీదాగిపోయింది
కానీ బ్రతికుండగానే ఆచారాల
పేరుతో నా ఊపిరిక్కడ
నలిగిపోతుంది కర్కశంగా..

నువ్వు పోయావని
చితిమంటల్లో నీ అస్తిత్వం
భస్మమైపోయింది
నేను బ్రతికుండగానే నా
అస్తిత్వమిక్కడ విస్మితమౌతుంది..

అడుగడుగునా
ఈ లోకం నాకు సాయంచేసే మిషతో
నా హృదయానికి గాయం చేసి
నన్ను నా నుండి మాయంజేసి
శోకవనంలోకి తోసేస్తున్నారు..
నేనేం చేయాలో...?
ఏం చేయరాదో..?
ఎలా ఉండాలో...?
ఏం చేయకూడదో.. కూడా
వీళ్ళే నిర్ణయిస్తున్నారు..

నువ్వు భవబంధాలు తెంపుకుని
స్వేచ్ఛగా నిర్మలాకాశంలోకి
ఎగిరెళ్లిపోయావు కానీ
నా స్వేచ్ఛ ఇక్కడ అడుగడుగునా
సాంప్రదాయాల పంజరంలో
బందీయై మిగిలిపోయింది..

నువ్వు ఇహలోక స్వాతంత్ర్యం పొంది
అన్నింటినీ తోసిరాజని నిష్క్రమిస్తే,
నేను నా స్వాతంత్ర్యాన్ని కోల్పోయి
ఒంటరి పోరాటమై, సంఘర్షణ సంకటమై
జ్ఞాపకాల శిలయై, భావోద్వేగాల శిలాజమై
అశ్రువుల్ని ఆలింగనం చేసుకుని
ఇక్కడ బతుకీడుస్తున్నాను..



**-సర్వరాజ్ అన్వర్,**
9440981198

## ఆట వెలదులు

నేటితరమునందు నీతి మంతులకయ్యి
వెతికినోడుపెద్ద వెర్రి వాడు
స్వార్థతనమెగాని సఖ్యతేదుందయా?
నిత్యకరుణజూపు! నీలకంఠ!

మంచి కొరకు నీవు మహినవెదికి నేమి?
నీదు మనసునందు నిలుపు ముందు
నిన్ను నీవు మార్చ నిఖిలమ్ము మారదా?
నిత్యకరుణజూపు! నీలకంఠ!

పరులతప్పులెత్తి పలుచనవ్వుటకంటె
స్వ నపరాధములను సర్దుకొనుము
యితరలందునీవు హితముగోరుటమేలు
నిత్యకరుణజూపు! నీలకంఠ!

దైవభక్తి చేత ధన్యులవ్వుటకంటె
దానధర్మమందు తలుచుమనసు
పుట్టుగిట్టునిచటె పుణ్యపాపములన్ని
నిత్యకరుణజూపు! నీలకంఠ!

స్వార్థబుద్ధిచేత సమసమాజమునందు
మంచిచెడులుయనక మసులువారు
మాన్యులవ్వలేరు మహిలోనమూర్ఖులు
నిత్యకరుణజూపు! నీలకంఠ!

పరులహితముగోరి యిరులదారందున
పయనమైనగాని ఫలితముండు
ఒరులకీడుదలచి సిరులుపొందఫలమ?
నిత్యకరుణజూపు! నీలకంఠ!

**- నవీన్ గొరైంక**
96180 39501

## సాక్షాత్కారం

విశ్వమత సమ్మేళనం
సోదరభావంతో కమనీయం
యువతకు తాను ఆదర్శం
జగమంత వివేకమయం
భారత సంస్కృతి సాంప్రదాయం
తరగని సంపదకు తార్కాణం
ఉజ్వల భవితకు శ్రీకారం
వివేకానందుడే యువతలో
సాక్షాత్కారం



**-ఉంద్రాళ్ళ రాజేశం,**
9966946084

## మాతృభాష

పాల మీగడ వలె పలకరించు తెలుగు
మాతృ భాష మనకు మనుగడిచ్చు
మరువకుండ నేర్చు మధురపు భాషను
తెలుగు జీవితముకు వెలుగు నిచ్చు..!

మాతృభాష కన్న మధురమ్ము లేదింక
మంచి తెలుపునెపుడు మన భవితకు
విలువ తెలిసి నీవు విద్యను నేర్వగా
అదియె గెలుపునిచ్చు యవని యందు..!

అమ్మ భాష మనకు యద్భుతంబు యిలన
మొదట నేర్చు భాష ముదము మనకు
విజయ తీరమునకు విద్య చేర్చు మనని
చక్క గాను మనము చదువుకొవలె..!

మమత తెలుపు మనకు మాతృభాష ఘనంగ
అక్షరముయె మనకు రక్ష యిలన
గౌరవించుదాము కమనీయ భాషను
మాతృభాషలోనె మహిని గెలుచు..!

అమ్మ మనకు నేర్పె కమ్మగా చదువును
విద్య నేర్చుదాము విలువ తెలిసి
అన్య భాష మోజు యతిగాను చూపకు
మాతృభాష లోనె మనుగడ కద..!



**-సునీత బండారు**
9440671530

## ఉషారుగా ఉందాం ఒత్తిడిని ఓడిద్దాం

పోటీ ప్రపంచం ఒక వైపు
పోలికలు ఏలికలు మరోవైపు
ఉరుకుల పరుగుల ప్రపంచంలో
పగలు ప్రతీకారాల సెగలలో
కుట్ర కుటిలత్వ కాఠిన్యాలతో
ఆందోళన అలజడి ఆవేశంతో
జీవన సమరంలో అలిసిపోయి
ఒత్తిడిలో భంధీయై మనోదౌర్బల్యత
రాజ్యమేలుతుంది
మనసులో ప్రశాంతత మందగించి
మొక్కలా మొదలైన ఒత్తిడి
వట వృక్షమై సంపదగా పరిణమించి
ఆరోగ్యాన్ని మంటకలిపి
కుంగుపాటు ఆస్తిగా ఒంటరితమే నేస్తమయ్యే
పాజిటివ్ ఆలోచనలతో
ఒత్తిడిని ఓడించు
ధైర్యమేనీ ఆయుధం కావాలి
ఆత్మవిశ్వాసమే నీపెట్టుబడి అవుతె
ప్రగతిశీల ఆలోచనలతో
ఆశావహాదృక్పథంతో
ప్రతి రోజు ఆరంభించాలి
జీవితం ఒక మొక్కలాంటిది
నవ్వులే పువ్వులుగ వికసిస్తే
ప్రతి రోజుపండుగే
జరిగింది జరుగబోయేది
మన మంచికే
గతమంతా ఒక పీడకల
ఉజ్జ్వల భవిష్యత్తు కోసం
ఉషారు ఉల్లాసమే జీవన శైలిగా
మనోప్రశాంతతకుపాటుపడుదాం
ప్రగతికి పురోగతికి బాట వేద్దాం
ఒత్తిడిని ఓడిద్దాం

**-నేదునూరి కనకయ్య,** 9440245771

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 798వ రోజు 'సహనం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'సహనం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## తాళం!

ఓర్పూ సహనం
భూమాతకి సహజం!
ఒళ్ళు విరిస్తే ప్రాణ ఆస్తి నష్టం!.
శ్రీరాముని సహనానికి
ఫలితం వనవాసం!
కైకకి ఉపశమనం!
సుగ్రీవుని పై చిటపట
సౌమిత్రికి లేదు
ఆ ఓర్పు సహనం!.
ద్రౌపది భీముడి చెవిలో పోరు!
దెప్పులు భరించె ధర్మజుడు!
స్థిత ప్రజ్ఞత నిజమైన యోగం!.
భావోద్వేగాలు కష్టాలు!
పెదాలపై చిర్నవ్వుల పూలతో
ఆస్పత్రిలో ఆయా నర్సులు!
కుళ్ళు చెత్త ఊడ్పులు!
ట్రక్కులోకంపు భరిస్తూ
నిలబడే సఫాయివారి సహనం!.
కొత్త సినిమా
తొలి ఆట తొలి రోజు
క్యూలో లొల్లి !
ఆపై గల్లీలోకి ఉరుకులు పరుగులు!
కుటుంబంలో సహనం ఓర్పు లేకుంటే
జీవితమంతా
మాయా సంసారం తమ్ముడూ
అని పాడుకోక తప్పదు!.
పరీక్షహాల్లో
ఇన్విజిలేటరు కాపలా!
పిల్లలకి గాబరా!
సహనం ఓర్పుతో ప్రశాంతత!.
కవుల కలాలు గళాలు
సహనం కోల్పోతే చిందరవందర!
సమూహ నిర్వాహకులకు
మందులేని తలనెప్పి!.
నోరు మనసుకి తాళం
గంతులు చిందులతో
బెడిసికొట్టు వ్యవహారం!
శాంతి సహనం లేకుంటే
అవ్వాయి చువ్వలు
సీమటపాకాయలా పేలే రాజకీయాలు!
మధ్యలో నలిగే జనాలు!
పలుకుతున్నా శాంతి మంత్రం!.

-ఎ.రాజ్యశ్రీ

## సహన ఛత్రం

అమ్మ
పురిటినొప్పుల్ని
సహనంతో భరిస్తేనే
బిడ్డ లోకాన్ని కళ్ళజూస్తుంది.
శాస్త్రవేత్త
సహనంతో చేసే పరిశోధనతోనే
నూతన ఆవిష్కరణ
వెలుగులో కొస్తుంది!.
సమస్యల ఆటుపోట్లను
సహనంతో ఎదుర్కొంటేనే
బ్రతుకు పోరాటంలో
గెలుపు లభిస్తుంది.
సహనం వహిస్తే
కోపాగ్ని చల్లబడుతుంది
సహనంతో సహిస్తే చేజారిన
పరిస్థితి చక్కబడుతుంది
సహనం సరిహద్దు దాటితే
దావాలనంలా దహిస్తుంది.
సహనానికి మారుపేర్లుగా నిలిచే
మాతృమూర్తి, వసుధలు
సహనంతో సేవచేసే
వైద్యసిబ్బందికి సాటి ఉన్నారా?!.
ఆవేశం అనర్థానికి దారితీస్తే
సహనం ఛత్రమై
అనర్థాన్నుంచి కాపాడుతుంది.

- చంద్రకళ దీకొండ

## అందరికీ అవసరం

ప్రతికూలతకి వ్యతిరేకం
నిరాశా నిస్పృహలకి దూరం
గమనం గమ్యానికి దారి
సహనం విజయానికి చేరువ
గమ్యం చేరాలని ఉరకలు వద్దు
గెలవాలని ఆవేశం వద్దు
గమ్యం చేరాలన్నా
జీవితంలో గెలవాలన్నా
సహనం కావాలి
సహనం సౌశీల్యం
ఓర్పు నేర్పులే
జీవితాన్ని తీర్చే సాధనాలు
సహనమంటే
సహించే ప్రక్రియ
ప్రశాంతంగా వుండే సామర్థ్యం
కార్య సాధనకి
ఏకాగ్రతతో పాటు
సహనమూ అవసరం.

-మోటూరి శాంతకుమారి

## ఆత్మ బలం

కల్పిస్తుంది నూతనోత్సాహం విజేతకి
బాటలు వేస్తుంది సహనం
ఉన్నత పురోగతికి
ఆచితూచి అడుగులువేయాలి ఉన్నతికి
ఉంటాయి పలు పరిమితులు విజేతకి.
చురుకుదనం ఉట్టిపడుతుంది
సహనం గెలుపుదారునికి
సహనం అలవర్చుకోవాలి
సాధ్యం విశిష్టస్థానం.
బాధ్యత మరింత రెట్టింపౌతుంది
విజేతగా నిలబడటం
కాపాడుకోవటం
అత్యవసరమవుతుంది
సమాజం
విజేతను గౌరవించి
పెద్దపీట వేస్తుంది
పురోగతికి సహనం ఆలంబనమౌతుంది
ఇతరులకు విజేత మార్గదర్శకులు
ప్రేరణ కారకులు
విజేత అభ్యుదయానికి కీలకం.
విజయుడయ్యాడు అర్జునుడు
సహనంతోనే పలు కార్యాలలో
సామాన్యుణ్ని
మాన్యుణ్ని చేసేది సహనమే
సహనంతో జీవన పోరాటంలో
పోరాడి గెలిచిచారు ఎందరెందరో
సహనంతో కాలానికి ఎదురురీడి
నిలిచినవారు విజేత.
సంసారాన్ని ఈది
బాధ్యతల్ని ఈడెర్చి
జీవితం పచ్చగా ఉన్నవారు
సహనంతోనే
శాంతిగా ఉన్నవారే
అలసిసొలసి విజేతలు
సహనం ఉన్న వారినే
జయం వరిస్తుంది
విజేత అనుభవాల పునాది సహనం
అదే అదే సునాయాస
విజేతకి మార్గం.

-ఆర్.ప్రవీణ్,

## మానవతాభరణం

జగతి సౌభ్రాతృత్వ సన్నిధికి
సహనం సౌశీల్యం
మానవతాభరణం.
సహనం గులాబీ పూవు
మెతకదనాన్ని
అలుసుగా తీసుకునే వారికి
ఆత్మాభిమానం ముళ్ళు
పరస్పరం గౌరవాభిమానాలను
నిలబెడుతూ
సంఘం ప్రతిష్టకు
ప్రతిరూపం ఓర్పు.
పిల్లల ఎదుగుదలలో ముఖ్యపాత్ర
పెద్దల పట్ల
గౌరవభావం ప్రదర్శించే
అక్షయపాత్ర
మర్యాదకు ఆసరా
ఈ మాలతీలత
అనుమానానికి తావివ్వనిది
ఈ దూసరీతీగ.
సహనశీలి
కష్టాలు కావళ్ళతో
మోసినా అలసిపోదు
విజయాలు నింగిని తాకినా
నేలను విడవదు.

- ఏడెల్లి రాములు

## సహనముతో సాగవలె

తే.గీ. అప్పుడప్పుడు వాటిల్లు హాని మనకు
సహనమును గల్గి లోకాన సాగవలెను
పరులమాటలు చేతలు పట్టుకొనక!
గొప్పవాడిగ యెప్పుడు తప్పు వలదు!.

-జక్కని గంగాధర్

## ఓర్పు

ఓర్పు నేర్పు
సర్వం మంచివే
ఓర్పు కుంటే దివ్యం
ఓర్పు లేకుంటే నీచం
స్త్రీకి సహజ భూషణం సహనం !
సహనానికి మరో పేరు ధరిత్రి !!!
అమ్మ కూడా అంతే!
స్త్రీలెందరో సహనానికి మారు పేరు
ఎంత కఠినమైన పనైనా
తన వారికోసం
త్యాగ నిరతితో సాధిస్తుంది
అదే సహనం !.
అనార్కలి స్త్రీ మూర్తి కాదా !
త్యాగంతో పాటు సహనం స్త్రీలకు
పెట్టని కోటలు భరించడానికి !
భూమిని మించిన సహనశీలురు
ఎక్కడున్నారు ఇలలో?
గొప్పవారు చేసేవి గొప్ప పనులు!!
అన్ని తరగతులు స్త్రీలు
సహనంతో
తమని తాము అర్పించుకునే
మహా మహిమాన్వితలే!.
ఎన్ని పేర్లు చెప్పను
అందరికందరూ వన్నెకెక్కిన వారే
మహిని స్త్రి మూర్తే
మహిమాన్విత
మహిత గుణసంపన్న!!!
ధరణికెంత ఓర్పో
వనితకంత ఓర్పు !!!.

-కె.కె.తాయారు

## సర్వసమ్మతం

వినడం ఎంత నేర్చుకుంటే
విజ్ఞానం అంత బోధనౌతుంది
విజ్ఞులకెప్పుడు ప్రథమ లక్షణం
విరజాజుల పరిమళ దైవత్వం.
ఆచి తూచి వేసే అడుగులకు
ఆలవాలమై ఆలంబనమౌతుంది
మేధో మధనానికి నాంది పలికే
స్థితప్రజ్ఞత ఉన్నత లక్షణం.
నిగ్రహాలతో నిశ్చలమై నిలువగలిగితే
మానసిక పరిపక్వతలతో పరిపుష్టమై
అడ్డంకులకెదురు నిలిచి అవలీలగా
విజయ బావుటాలు ఎగరేయగలరు.
కొన్నిసార్లు చేతకానితనంగా కూడా
పరిగణన ప్రమాదం
కలికాలాన మాత్రం
హద్దుల్లో నిలబడి
హద్దు మీరితే
సుద్దులు బోధించాల్సిందే
అసహనం అంకురమై మొలకెత్తితే
అనారోగ్య పంటలతో విష కలుషితమై
నిజాలను మరుగుపరిచి
నీచాలకు పాల్పడే దారులకు
దగ్గర చేస్తుంది.
మంచివారికి సహనం
కట్టలు తెంచుకుంటే
మరుభూమిని తలపించే
మహోజ్వల సునామిలే
అనాదిగా నిరూపితం
మతమేదైనా
సహనమే
సర్వసమ్మతమని నమ్మిక.

-నగునూరి రాజన్న

## సహనమే సంస్కారం

చేరుకోవాలంటే నిర్దిష్ట లక్ష్యం
అవసరం అంకిత భావం
భావోద్వేగం
సహనం దాని మరో నామధేయం
మనిషికవసరం
శాంతి, సహనం
సహనమే తెలుపుతుంది
మనకున్న సంస్కారం.
సదా అనర్థం
సహన లోపం
ఎంత ఉన్నా నైపుణ్యం, చాతుర్యం
అందుకోవాలంటే ఉన్నత శిఖరం
కావలి అవసరానికి తగ్గ సహనం
సహనానికున్నా ఆరంభ వేదనం
సాధిస్తుంది అంతిమ విజయం
అది చరిత్ర చెబుతున్న సత్యం.
పాండవుల వనవాస సహనం
సాధించింది కురురాజ్య సింహాసనం
జతగూడితే స్థితప్రజ్ఞత, సహనం
అది ఉత్తమ నాయకత్వ లక్షణం
సీత, భూమాత, వనితల సహనం
నాటికైనా ఏనాటికైనా ఆదర్శం.
సహనంతోనే అభ్యాసం సాధ్యం
సహనంతోనే గురుకటాక్షం
ఇంతి సహనం
ఇంటిని చేయు స్వర్గం
తల్లి సహనం నేర్పు సంస్కారం
సహనంతో ఇంట బయటా
గెలుపు తథ్యం
అసూయాద్వేషాలకు మూలం
అసహనం.

-జె.వి.కుమార్ చేపూరి

## ఓర్పు - భవిత తీర్పు

ఓర్పుతో నేర్పు పొంది
కూర్పుతో జీవన తీర్పు
చేసుకొని
సాగిపోవచ్చు.
ఓర్పుకు రోగం దూరమై
శాంతి సారం దగ్గరై
మానసిక బలిమి పెద్దదై
మనుగడ మౌనంగా
కీర్తి శిఖరం చేరుతుంది.
ఓర్పుకు కోపం
తాపం
బెదిరిపోయి
దైవం రూపం
నిలిచిపోయి
దయామయ శిల్పం
పూజలందుకొంటుంది
ఓర్పు ఆచరణీయం
ఆలోచనా శక్తికి ఆయుధం
విజయానికి యానకం
ఓర్పు రూపం దైవం.

-జె.నరసింహారావు

# జర్నలిస్టులకి డబుల్ బెడ్ రూం ఇళ్లు.. పట్టాలు అందించిన మంత్రి హరీశ్ రావు

మెదక్, ఏప్రిల్ 5: (నేటినిజం ప్రతినిధి):మెదక్ జిల్లాలో రాష్ట్ర ఆర్థిక ,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు పర్యటించారు. మేళతాలలు, సన్నాయి, మంగళ హారతులతో మంత్రి హరీష్ రావు ,ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి లకు స్వాగతం పలికారు లబ్ధిదారులు.. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళ్ళు అర్పించారు మంత్రి హరీష్ రావు. డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లిన మంత్రి హరీష్ రావు ను,ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి లను సన్మానించిన లబ్ధిదారులు..రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఆటపాటలతో సందడి చేసిన కళాకారులు.. డబుల్ బెడ్రూం ఇల్లు పొందిన లబ్ది దారులకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి హరీష్ రావు ,ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ,ఎమ్మెల్సీ ఏగ్గే మల్లేశం జిల్లా కలెక్టర్ రాజర్షి షా జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇల్లు పంపిణీ చేసిన మంత్రి హరీష్ రావు,ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి .డాక్టర్ బాబు జగజీవం రాం జయంతి రోజు ఇళ్లలోకి వెళ్లడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ దళిత వర్గాల కోసం దళిత బంధు, ఎస్సిఎస్టీ సబ్ ప్లాన్ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. రూ. 20 కోట్లతో రమాయమోయటలో డబుల్ బెడ్రూం ఇల్లు తీసుకుంటున్నాం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ 60 వేలు ఇస్తే 40 వేలు అప్పు కింద ఇచ్చేది. రూపాయి ఖర్చు లేకుండా రూ 15 లక్షల విలువగల ఇళ్లు ఇస్తున్నాం .

పద్మమ్మ ను నిండు మనసుతో ఆశీర్వదించాలి. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద అంగన్ వాడి,రేషన్ షాపు ఇవ్వమని కలెక్టర్ కు చెప్పానన్నారు. ఈ నెలలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తాం అన్నారు. రామయంపేట అభివృద్ధి కోసం వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం.

## సునందామృతం

## కంబళ భోజన న్యాయము 2

కంబళి అంటే గొంగళి లేదా గొంగడి. గొంగడిలో కూర్చుని భోజనం చేస్తూ వెంట్రుకలు వస్తున్నాయని బాధ పడటం లేదా వెంట్రుకలు ఏరడాన్ని కంబళ భోజన న్యాయము అంటారు. కంబళి లేదా గొంగళిని గొర్రెల వెంట్రుకలతో తయారు చేస్తారు.

వాటి వెంట్రుకలు పొడవు తక్కువగా ఉండటం వల్ల భోజనం చేసేటప్పుడు ఏ కొంచెం గాలి వీచినా, కదిలినా మనకు తెలియకుండానే వెంట్రుకలు తినే భోజనంలో పడే అవకాశం ఉంది.

దీనినే సామెతగా "గొంగట్లో తింటూ వెంట్రుకలను ఏరుకున్నట్లుంది" అంటుంటారు.

ఈ న్యాయమును ఎక్కువగా వ్యవస్థ, సమాజం గురించి చర్చించేటప్పుడు వాడుతూ ఉంటారు.

ఈవ్యవస్థలో, సమాజంలో అందరమూ భాగస్వాములమని తెలుసు. కానీ దాన్ని మార్చేంత శక్తి లేనప్పుడు ,పరిస్థితులు చెయ్యిజారి పోయినప్పుడు వ్యవస్థ భ్రష్టు పట్టిపోయిందనీ, సమాజం మునుపటిలా లేదని పడే బాధను ఈ కంబళ భోజన న్యాయమునకు సరైన ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

-పురిమళ్ల సునంద
9441815722

## నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-13)



అంతులేని ప్రేమ చూపిస్తున్న పెనిమిటి
అనంతమైన దుఃఖాన్ని కానుకగా ఇచ్చిన ప్రకృతి
ఏదీ శాశ్వతం కాని జీవితం
బతికున్నంత కాలం భరించడమే అనుభవం.

దేశం మీద చక్రం బట్టుకుని తిరుగుతున్నప్పుడు
వానికేం? గుండ్రాయి లాగా
బాగానే ఉన్నాడనుకొని
బండరాయిలా బతికేసింది.

ఇప్పుడు...
నీవే నా జీవితం – నీ తోడిదే నా బతుకు అంటూ
ప్రేమ పావురమై తిరుగుతూ
కాళ్లిరిగి కళ్ళ ముందరనే పడిపోయినాడు
ఉన్నాడని మురిసిపోలేదు
కదలకుండా పడి ఉన్నాడని ఏడుస్తూ కూర్చోలేదు!

ఎవరైనా ఎంతకాలం సానుభూతి చూపిస్తారు?
సానుభూతి కడుపు నింపదు
అందులో నోళ్లెన్నో.. నొసళ్లెన్నో...
పొట్టూ పొల్లకాదూ కొట్టుక పోతే
మిగిలే గింజలు ఎన్నుంటయ్...
అసలుంటయా
అనుకుంటనే ఉలిక్కి పడ్డది సరయూ,

ఎదురుగా అత్తమ్మ...!
మేనత్త!
దయ్యం కనిపిస్తేనే కాదు అనుకోకుండా దేవుడు
కనిపించినా
ఉలికిపాటు తప్పదు !
ఎందుకంటే – ఈమె తపస్సు చేయకుండానే
ఆమె ప్రత్యక్షమైంది!
అత్తమ్మ కొంగులోకి ఒంపిన కన్నీళ్లు
ఆమె గుండెలోకి చేరినై

ఈమె బరువు ఆమె మీదికి ఒరిగింది
తల్లి లేని తనకు తల్లిని మించిన ఆదెరువయ్యింది
అత్తమ్మ పేరు పోచమ్మ!

ఊరు బయట ఉండి పోచమ్మ తల్లి
ఎంతమందిని కాపాడుతున్నదో తెలవదు!
అత్తమ్మ మాత్రం
'నీ ఆపదలో నేనున్నా'నని ఆలింగనం చేసుకున్నది!
'నీ యెత కత తెలిసి
ఉండలేక వచ్చిన!
బిడ్డలు లేని నాకు నీవే బిడ్డవు!
అనుకున్నది పోచవ్వ

సావు బతుకుల మధ్యనున్న నాకు
తోడుగా నీడగా నిలవడ నీకే వచ్చినవు!
తల్లి లేని నాకు నీవే తల్లివి! అనుకున్నది సరయు

ఆ రాత్రి
క్షణాలను గుండెల్లో అదిమి పట్టుకొని
ఓదార్పు చూపులతో కాపాడుకున్నారు.

వీళ్ళ మాటలకు మౌనసాక్షి
మంచం మీద కదలకుండా పడి ఉన్న దర్శనం
కన్నీళ్లు
ఇట్లా అనుకున్నయ్...
ఈ తల్లి గాని తల్లి –
బిడ్డ గాని బిడ్డ 'సల్లగుండాలె' అని

చంటి పిల్ల ఏడుపు
వాళ్లను వాస్తవంలోకి లాగింది

-దోరవేటి
సెల్:9866251679

## కోతుల పని (కథ)

బీరయ్య చాలా బీదవాడు. అతడు కొత్తగా తాటి ఆకులతో ఒక గుడిసెను నిర్మించుకున్నాడు.కానీ అనుకోకుండా అక్కడకు ఒక పిల్ల కోతి మూక వచ్చి ఆ తాటి ఆకులను పీకి కుప్పబెట్టాయి.

ఆ సమయంలో బీరయ్య ఇంట్లో లేడు. అతడు ఊరికి వెళ్ళాడు . ఆ తెల్లవారి బీరయ్య వచ్చి అది చూచి లబోదిబోమన్నాడు. ఆ తర్వాత అది కోతుల పనేనని తెలుసుకొని ఆ కోతులతో "మీరు నాకు ఇంత నష్టం చేస్తారా! మరొకరికి ఉపకారం చేయాలని తెలియదా! నేనే పేదవాడిని. అలాంటి నాకు నష్టం కలిగించడం వల్ల మీకు వచ్చిన లాభం ఏమిటి? నేను అప్పుడప్పుడు మీకు ఆహారం కూడా పెడుతున్నాను కదా! తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం అంటే ఇదేనేమో! మీరు ఇటువంటి చెడు పనులను చేసి మీ కోతులకు అపకీర్తిని తెస్తున్నారు" అని అన్నాడు .

అది విన్న పిల్ల కోతులు తాము చేసిన పనికి విచారం వ్యక్తం చేశాయి. తమ తప్పును ఎలా సరిదిద్దుకోవాలని అవి బీరయ్యనే అడిగాయి. అప్పుడు బీరయ్య " ఏముంది? మీరు నాకు తిరిగి ఆ గుడిసెను కప్పి ఇవ్వండి !"అని అన్నాడు. అప్పుడు అవి "అయ్యో! మాకు ఆ గుడిసెను పీకి కుప్ప పెట్టడం తప్ప దానిని కప్పడం రాదే! అది ఎలాగో నీవే చెప్పు!" అని అన్నాయి. అప్పుడు బీరయ్య " అదిగో! ఆ ఎదురుగా కనబడే కనకయ్య గుడిసెను చక్కగా కప్పుతాడు. మీరు వెళ్లి ఆయనని అడగండి !"అని ఆయన వాటికి సలహాను ఇచ్చాడు .

అప్పుడు కోతులు కనకయ్య వద్దకు వెళ్లి బీరయ్య ఇంటి గుడిసె ఆకులను పీకి తాము నష్టపరిచామని ,దానిని తిరిగి కప్పాలని అతనిని కోరాయి .అందుకు కనకయ్య నిరాకరించి "నాకు డబ్బు ఇస్తే తప్ప నేను ఆ గుడిసెను కప్పలేను .నేను ఎలా బ్రతకాలి ?నా పొట్టకూటికి అందరికీ గూన పెంకులు, గుడిసె ఆకులను కప్పి వారు ఇచ్చిన డబ్బులు తీసుకొని నేను బ్రతుకుతున్నాను" అని అన్నాడు . అప్పుడు కోతులు "అలాగా! అయితే మేము ఇప్పుడే నీవు కోరినంత డబ్బును తెచ్చి ఇస్తాంలే!" అని అక్కడి నుండి వెళ్లాయి.

తర్వాత అవి ఆ దారిన పోయే ఒక బాటసారి వద్దనుండి అతని వద్ద ఉన్న డబ్బుల సంచిని లాక్కొని ఎత్తుకొని వచ్చాయి .ఆ డబ్బులు సంచిని కనకయ్యకు ఇచ్చాయి .కనకయ్య ఆ సంచీలోని డబ్బులను లెక్కపెట్టే సమయంలో అక్కడికి ఆ బాటసారి ఏడుస్తూ పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతడు కనకయ్యతో " అయ్యా! ఇది నా డబ్బు. ఈ కోతులు నా వద్ద నుండి దీన్ని ఎత్తుకొని వచ్చాయి .ఇది మీకు ధర్మం కాదు .నేను పేదవాడిని. నెల రోజుల కూలి పని చేస్తేనే ఈ డబ్బు నాకు వచ్చింది .నేను ఈ డబ్బులు ఇంటికి తీసుకొని పోకుంటే నా కుటుంబమంతా రేపటినుండి పస్తు ఉండాల్సిందే "అని ఆ బాటసారి కన్నీరు పెట్టుకున్నాడు.

అప్పుడు కనకయ్య కోతులతో " ఛీ....ఛీ... ఇలాంటి సొమ్ము నాకు అక్కర్లేదు. మిమ్మల్ని డబ్బు నిజాయితీగా సంపాదించి తెమ్మన్నాను గానీ ఇలా చేసి కాదు. ఈ డబ్బును వాడుకుంటే ఆ పేదవాడి కన్నీళు నాకు కూడా సోకుతాయి .అందువల్ల మీరు నిజాయితీగా డబ్బులు సంపాదించి తెచ్చి నాకు ఇస్తే తప్ప నేను మీరు చెప్పిన ఆ గుడిసెను నేను కప్పలేను "అని అన్నాడు .అప్పుడు కోతులు ఆ డబ్బుల సంచిని ఆ బాటసారికి ఇచ్చివేశాయి. అతడు సంతోషంతో ఆ సంచీని తీసుకొని ఆ కనకయ్యకు ,కోతులకు ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయాడు .

ఆ తర్వాత కోతులు అక్కడ కూలి వాళ్ళు చాలామంది ఒక భవనం నిర్మిస్తుండగా పనిచేయడం చూశాయి. అవి ఆ మేస్త్రి వద్దకు వెళ్లి తాము కూడా పని చేస్తామని , తమకు పని ఇమ్మని కోరాయి. అందుకు తమకు కొంత డబ్బు కావాలని కూడా అవి ఆ మేస్త్రిని అడిగాయి .అందులకు ఆ మేస్త్రి అంగీకరించాడు.

వెంటనే ఆ కోతులన్నీ ఇటుకలు, రాళ్ళను మోశాయి .ఆ మేస్త్రి సంతోషించి వాటికి ఆ రోజు కూలి డబ్బును ఇచ్చి వేశాడు. అవి ఆ డబ్బును తీసుకొని వచ్చి కనకయ్యకు ఇచ్చాయి. కనకయ్య వాటితో " ఆ ....ఆ .....ఇది మీరు కష్టపడి సంపాదించిన డబ్బు . చూశారా! ఎంత కష్టపడితే మీకు ఈ డబ్బు వచ్చిందో ! ఆ చెమటలు చిందించే మీ ముఖాలు చూస్తుంటేనే నాకు మీరు కష్టపడ్డారని తెలుస్తోంది . రేపే నేను బీరయ్య ఇంటి గుడిసెను కప్పుతాను" అని అన్నాడు.

అతడు మరునాడు గుడిసెను కప్పడం ప్రారంభించాడు. దానికి కోతులు కూడా సహకారం అందించాయి. రెండు రోజుల్లో ఆ గుడిసె పని పూర్తి అయింది. అప్పుడు కోతులు "అబ్బా! ఒకే నిమిషంలో ఈ గుడిసెను పీకి వేశామే! కానీ దీన్ని వేయడానికి ఎంతో సమయం పట్టింది. మంచి పని చేయడం ఎంత కష్టమో, చెడు పని చేయడం ఎంత సులభమో ఇప్పుడు మాకు తెలిసింది "అని కనకయ్యతో అన్నాయి. ఆ గుడిసెను చూసిన బీరయ్య ఎంతో సంతోషించి కోతులను అభినందించాడు. తర్వాత బీరయ్య ఆ గుడిసెలోనికి ప్రవేశించి భోజనం వండి ఆ కోతులకు పెట్టాడు. అది తిన్న పిల్ల కోతులు మరొకసారి అలాంటి చెడు పనులు చేయకూడదని,మంచి పనులకే ఆదరణ ఉంటుందని తెలుసుకున్నాయి.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535




## నేటి కందం- నేటికి అందం

కం॥ భ్రాంతులను బాలగ జేయుచు
క్రాంతికి పట్టమును గట్టు కరుణన-క్రీడల్
శాంతికి, వృద్ధికి గూర్చుచు
కాంతుల నందించు-నేటి-కమ్మని వేళన్!!

(ఏప్రిల్ 6 శాంతి, వృద్ధి లక్ష్యాలుగా ఆటలు ఆడే అంతర్జాతీయ దినోత్సవం..)

-రాధశ్రీ
సెల్:9494481210

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే

(ప్రథమ)

### పితృవాక్య పరిపాలకుడు

జగదభిరాముడు
ఇనకులసోముడు
శిష్ట రక్షణకై దుష్టశిక్షణకై
ధర్మ సంస్థాపనార్థం
ఇలలో వెలసిన దేవుడు!!.
త్రైలోక్యపూజ్యుడు
అవతారపురుషుడు
ఆడినమాట తప్పక
కానలకేగిన ఘనుడు
పితృవాక్య పరిపాలకుడు!!.
ఒకే మాట ఒకేబాట
ఒకే బాణం ఒకే సతి
అని చాటిన
వినయశీలుడు
మార్గదర్శకుడు!!.
అన్నదమ్ముల పట్ల
అనురాగముండాలని
గురువులను మాతాపితరులను
గౌరవించాలని
దేవుడే మనిషిగా అవతరించి
లోకానికి చాటిన కారణజన్ముడు
సంపూర్ణ మానవుడు
మర్యాదా పురుషోత్తముడు!!.
దశరథ పుత్రుడు
కౌసల్యా తనయుడు
కోరిన వారికి కొంగుబంగారం
రామ రామ అనిన చాలు
ఒసగును సిరులు
సీతారాములను
తలచిన చాలు
తొలగును ఈతిబాధలు
రామనామం దివ్యనామం
సర్వపాపహరం
సకలం శుభం శ్రేయస్కరం!!.

-పరిమి వెంకట సత్యమూర్తి,
9440720324

(ద్వితీయ)

### సరైనోడు

కాల చక్రపు పరుగులో
కనుమరుగైపోతున్న మానవ
సంబంధాలను సరిదిద్ద
సరైనోడు వచ్చి సంతోషపు
జల్లుతో లోకాన్ని తడుపుతాడు.
అహంనిండిన ఆంబోతులు
అడుగడుగున అరాచకాలు చేస్తు
అంధకారాన్ని అవలీలగా పెంచుతు
బంధాలన్నింటిని బూడిదచేసి
బరితెగించి బలాదూర్ అంటుంటే
బడితపూజ చేయ సరైనోడు
సమయానికి వస్తాడు.
బలవంతుడెంత గొప్పవాడైనా
అహం ఆభరణమైతే
అది నిప్పుగమారి సెగలు కక్కుతు
స్వయంగా దహించి బూడిదను చేసి
కనుమరుగు చేయ యుగయుగానికొక
సరైనోడు వస్తాడు.
పదితలల అహంకారి
జ్ఞాన సంపన్నుడైని అజ్ఞానిగ మారి
కామపు మైకంలో
కనులు మూసుకుపోయి
కఠిన హృదయంతో
కష్టాలు పెంచుతే
ఆదర్శ యుగ పురుషుడు
అయోధ్యా యోధుడు రావణుని
అంతంచేయ సరైన సమయంలో
రఘురాముడు సరైనోడు.
జనం మాటను రాచబాటగ చేసి
నిజాయతినే చట్టంగా మలచి
కష్టాలను దూరంచేయ
ఇష్టంగా పదవిలో రాణించిన
యుగ పురుషుడు
జానకిరాముడు
సరైనోడు

-డా.బి.సుధాకర్,
సిద్దిపేట

# వారాల ఆనంద్‌కు ఘనంగా పౌర సన్మానం



సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసే శక్తిమంతులు సాహితీవేత్తలని, కరీంనగర్ జిల్లా ఎందరో కవులు, కళాకారులకు పుట్టినిల్లని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసే శక్తిమంతులు సాహితీవేత్తలని, కరీంనగర్ జిల్లా ఎందరో కవులు, కళాకారులకు పుట్టినిల్లని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇటీవల అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన వారాల ఆనంద్‌కు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టరేట్ ఆడిటోరియంలో పౌర సన్మానానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై వారాల ఆనంద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద్‌కు సాహిత్య అకాడమీ అవార్డు రావడం జిల్లాకు గర్వకారణమని, తెలంగాణ ఉద్యమాన్ని నడిపింది కవులు, కళాకారులేనని, వారిని గౌరవించుకోవడం మన సంస్కృతిలో ఒక భాగమని అన్నారు. ఆనంద్ కవిత్వాన్ని అధ్యయనం చేయడం జీవితంలో అంతర్భాగంగా చేసుకున్నారన్నారు. కరీంనగర్ సాహిత్యానికి ఒకవేదిక ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని, అందులో భాగంగా త్వరలోనే భూమిపూజ చేసి సాహితీ మందిరం నిర్మించి కవులను సత్కరించుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ వారాల ఆనంద్ తన మనస్సుతో తాను మమేకమై అనువాద సాహిత్యంలో కృషి చేస్తున్నారని, అవార్డు పొందడం ద్వారా జిల్లా, రాష్ట్ర గౌరవం పెంపొందించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, డీఈవో జనార్దన్‌రావు, ప్రముఖ తమిళకవి, కలెక్టర్ తండ్రి జననేసన్ వీర రాఘవన్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, సాహితీగౌతమి కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, కేఎస్ అనంతాచార్యతోపాటు పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు, సినీ అభిమానులు పాల్గొన్నారు.

# సాహితీ ప్రముఖులకు ఉగాది పురస్కారం




ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఉదయ్‌కుమార్, శరత్‌జ్యోత్స్నారాణి

వివిధ సాహితీ ప్రక్రియలలోని ప్రముఖులకు శోభకృత్ ఉగాది సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం త్యాగరాయ గానసభలో జ్యోత్స్న కళాపీఠం, సంస్కారభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్య కవిత్వంలో ఎ. వరలక్ష్మి, వచన కవిత్వంలో స్వాతి, కథా ప్రక్రియలో శాంతకుమారి, సాహితీ విమర్శలో బి. జయరాములు, సాహిత్య వ్యాసాలుగా పి.భారతి, అనువాద ప్రక్రియలో భుజంగరెడ్డి, సాంస్కృతిక రంగంలో రవళిరమేష్ పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ కేంద్ర ఆకాశవాణి సంచాలకుడు పి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్, కన్ను, మనోనేత్రం వీటిని ప్రతి వారూ నియంత్రణలో ఉంచుకోవాలని ముఖ్యంగా వార్ధక్యం అధిగమించేందుకు కళలు మాత్రమే దోహదం చేస్తాయన్నారు. అధ్యక్షత వహించిన సాహితీవేత్త గౌరీశంకర్ మాట్లాడుతూ జ్యోత్స్నరాణి ఉన్నత స్థాయిలో ఆచార్య స్థాయిలో ఉండి సంస్థ నిర్వాహకురాలుగా ప్రముఖులను గుర్తించి సత్కరిస్తున్నారన్నారు. ఈ సత్కారానికి విశ్వవిద్యాలయం స్థాయి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. సంస్కారభారతి ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శివాజీ, పి. భట్టేశ్వరశర్మ, రమణజ్యోత్స్న, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.